మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక
www.evarthalu.com

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

సోమవారం MONDAY 24-8-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00
సంపుటి: 2 Volume:2 || సంచిక: 56 Issue: 56

23 ఆగస్టు 2026 - ఆదివారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - వర్ష ఋతువు శ్రావణ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:04 సూర్యాస్తమయం - సా. 6:33 తిథి ఏకాదశి తె. 4:18 వరకు తరువాత ద్వాదశి సంస్కృత వారం భాను వాసరః నక్షత్రం మూల సా. 5:35 వరకు తరువాత పూర్వాషాఢ యోగం విష్కంభ ఉ. 6:13 వరకు కరణం వనిజ మ. 3:10 వరకు విష్టి తె. 4:18 వరకు వర్జ్యం మ. 3:56 నుండి సా. 5:44 వరకు దుర్ముహూర్తం సా. 4:53 నుండి సా. 5:43 వరకు రాహుకాలం సా. 4:59 నుండి సా. 6:33 వరకు యమగండం మ. 12:18 నుండి మ. 1:52 వరకు గుళికాకాలం మ. 3:25 నుండి సా. 4:59 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:28 నుండి తె. 5:16 వరకు అమృత ఘడియలు ఉ. 10:38 నుండి మ. 12:25 వరకు అభిజత్ ముహూర్తం ఉ. 11:53 నుండి మ. 12:43 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున

Circulated to Telangana
Published from Jagitial



# పాతవాళ్లకే పెద్దపీట

## 70-80 శాతం సీట్లు వాళ్లకే

**కొత్తవాళ్లకు 20% పదవులు.. టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్**

రాష్ట్రంలో నామినేటెడ్ పదవుల భర్తీపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ కీలక ప్రకటన చేశారు. సెప్టెంబర్‌లో నామినేటెడ్ పదవుల భర్తీ చేస్తామని స్పష్టం చేశారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన పాత కార్యకర్తలకు 70 నుంచి 80 శాతం నామినేటెడ్ పదవులు కేటాయిస్తామని తెలిపారు. కొత్తగా పార్టీలోకి వచ్చిన నేతలకు 20 శాతం పదవులు ఇస్తామని అన్నారు.

హైదరాబాద్, ఆగస్టు 23 (ఈవార్తలు): ఆదివారం రోజున నిజామాబాద్ జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ ముఖ్య నేతలు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా మహేశ్ గౌడ్ , ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు. పలు కీలక అంశాలపై మహేశ్ గౌడ్ కాంగ్రెస్ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ కోసం అహర్నిశలు శ్రమించిన నిబద్ధత కలిగిన కార్యకర్తలకు ఈసారి ప్రాధాన్యం ఇస్తామని మహేశ్ కుమార్ గౌడ్ చెప్పారు. కాంగ్రెస్ పార్టీ తన అంకితభావం కలిగిన కార్యకర్తల కష్టాన్ని ఎల్లప్పుడూ గుర్తిస్తుందని, వారికి తగిన గుర్తింపునిస్తుందని తెలిపారు. గతంలో పదవుల భర్తీలో కొన్ని తప్పిదాలు తరువాయి 2 వ పేజీలో...

# బీసీ వర్సెస్ ఓసీ!

## రాజగోపాల్‌పై మౌనం.. సురేఖపై హడావుడి?

**కాంగ్రెస్‌లో 'సామాజిక న్యాయం'పై కొత్త ప్రశ్నలు.. బీసీ నేతల్లో అసంతృప్తి.. అధిష్టానంపై అసహనం**

తెలంగాణ కాంగ్రెస్‌లో కొండా సురేఖ వ్యవహారం క్రమంగా రాజకీయ, సామాజిక సమీకరణాల వైపు మళ్లుతోంది. మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలపై పార్టీ నేతలు మూకుమ్మడిగా స్పందించడం, మంత్రి సురేఖపై కూడా క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్లు రావడం ఇప్పుడు కొత్త చర్చకు తెరలేపింది. సురేఖను టార్గెట్ చేస్తున్న తీరుపై బీసీ వర్గాల్లో అసంతృప్తి వ్యక్తమవుతుండగా.. ఇది కేవలం పార్టీ క్రమశిక్షణ వ్యవహారమేనా? లేక సామాజిక సమీకరణాలకు కొత్త సంకేతమా? అన్న ప్రశ్నలు రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి. ఇటీవల సురేఖ కుమార్తె సుస్మిత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్‌లో తీవ్ర ప్రతిస్పందన వచ్చింది. సుమారు 20 మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు బహిరంగంగా పార్టీ నాయకత్వాన్ని చర్యలు కోరారు.

(ఈవార్తలు- తెలంగాణ పొలిటికల్ బ్యూరో)



క్రమశిక్షణ కమిటీ కూడా ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించింది. అయితే ఇక్కడే కాంగ్రెస్‌లోని కొందరు బీసీ నేతలు మరో ప్రశ్నను ముందుకు తెస్తున్నట్లు సమాచారం. ఇదే కఠిన వైఖరి గతంలో పార్టీ సీనియర్ నేతలు చేసిన బహిరంగ వ్యాఖ్యల విషయంలో ఎందుకు కనిపించలేదన్నదే ఆ ప్రశ్న. ముఖ్యంగా కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ముఖ్యమంత్రి నాయకత్వంపై, ప్రభుత్వ పనితీరుపై తీవ్ర వ్యాఖ్యలు చేసిన సందర్భాలను గుర్తు చేస్తున్నారు. ఇటీవల కూడా ఆయన చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్‌లో చర్చకు దారితీశాయి. రాజగోపాల్‌రెడ్డి విషయంలో పార్టీ పెద్దల స్పందన తీరుతో పోలిస్తే.. సురేఖ వ్యవహారంలో మాత్రం ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఒకేసారి రంగంలోకి దిగడం ఎందుకు? అన్న చర్చ మొదలైంది. ఈ తేడా వెనుక రాజకీయ కారణాలున్నాయా? లేక సురేఖ వ్యవహారాన్ని పార్టీ నాయకత్వం మరింత సీరియస్‌గా తీసుకోవడానికి ఇతర కారణాలున్నాయా? అనే ప్రశ్నలు -2 వ పేజీలో...




# నేనొస్తున్నా.. అన్నీ మాట్లాడుతా!

## అమెరికా టూర్ రద్దుపై రేవంత్ ట్వీట్

**నేడు ఉదయం 6 గంటలకు సిటీకి రాక**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. తన అమెరికా పర్యటన రద్దు వ్యవహారంపై ఎక్స్ వేదికగాస్పందించారు. కేంద్ర విదేశాంగ శాఖ.. తన అమెరికా పర్యటనకు రాజకీయ కారణాలతోనే అనుమతి నిరాకరించిందని సంచలన ఆరోపణలు గుప్పించారు. ఈ నేపథ్యంలో అమెరికాలోని బోస్టన్‌కు వెళ్లకుండా లండన్ పర్యటనను ముగించుకుని హైదరాబాద్‌కు తిరిగి వస్తున్నట్లు తెలిపారు.

లండన్/హైదరాబాద్, ఆగస్టు 23 (ఈవారత్లు): హైదరాబాద్‌కు చేరుకున్న తర్వాత తన పర్యటన రద్దుకు సంబంధించిన అన్ని విషయాలపై మాట్లాడతానని తేల్చి చెప్పారు. సోషల్ మీడియా వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి తన తాజా వ్యాఖ్యలను వెల్లడించారు. కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ.. అమెరికా పర్యటనకు అనుమతి ఇవ్వకపోవడంతో ముందుగా నిర్ణయించిన షెడ్యూల్‌ప్రకారం లండన్ నుంచి బోస్టన్‌కు వెళ్లలేకపోతున్నానని ముఖ్యమంత్రి తరువాయి 2 వ పేజీలో...

## బంగ్లాదేశ్‌లో రిటైర్డ్ హిందూ టీచర్ కుటుంబం హత్య

2




బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.16,309 |
| వెండి (కిలో): | రూ.2,70,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,742 |

## విశ్వవాణి



ధమనుల్లోని కాల్షియంను గుర్తించి భవిష్యత్తులో గుండెపోటు, ఇతర హృదయ సమస్యల ముప్పును తెలుసుకోవచ్చని శాస్త్రవేత్తలు తెలిపారు. కాల్సిఫికేషన్‌ను ముందుగానే గుర్తించడం ద్వారా జీవనశైలిలో మార్పులు, అవసరమైన చికిత్సతో గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించవచ్చని పేర్కొంటున్నారు.



## పది రోజులైనా ప్రోరోగ్ చేయరేం?

**పార్లమెంట్ సమావేశాల ముగింపేది?**

**మోదీ సర్కారు వ్యూహమేంటి?**

**మహిళా, డీలిమిటేషన్ బిల్లులకు యత్నాలు?**

న్యూఢిల్లీ: పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఈ నెల 13న నిరవధికంగా వాయిదా పడ్డాయి. కానీ, పది రోజులైనా సమావేశాలు అధికారికంగా ముగిసినట్లు రాష్ట్రపతి కార్యాలయం నుంచి ఇంకా ప్రకటన రాలేదు. ఈ అసాధారణ జాప్యం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కొత్త సమావేశాలు తరువాయి 2 వ పేజీలో...

# ఆటోవాలాల సమ్మె విరమణ

**కార్మిక సంఘాలతో సర్కార్ చర్చలు సఫలం**

**ఆర్టీసీ ఆటోలు తేబోమన్న మంత్రి పొన్నం**

**సమస్యల పరిష్కారానికి సానుకూల స్పందన**

సమ్మె విరమిస్తున్నామన్న ఆటో కార్మికులు

హైదరాబాద్, ఆగస్టు 23 (ఈవార్తలు): రాష్ట్రవ్యాప్తంగా ఆటో కార్మికులు తలపెట్టిన నిరవధిక సమ్మెను విరమించుకుంటున్నట్లు రాష్ట్ర ఆటో, యాప్ ఆధారిత సంఘాల జేఏసీ నేతలు ప్రకటించారు. ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు సమ్మె విరమణ పత్రాన్ని విడుదల చేశారు. ఆటో డ్రైవర్ల సమస్యలపై ప్రభుత్వం, కార్మిక సంఘాల ప్రతినిధుల మధ్య ఆదివారం -2 వ పేజీలో...



# మేకిన్ ఇండియా.. ప్లే ఇన్ ఇండియా

**విశాఖ వేదికగా 'బ్రిక్స్' క్రీడా తీర్మానం.. కీలక ప్రతిపాదనలు చేసిన భారత్**

ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం వేదికగా జరిగిన బ్రిక్స్ క్రీడా మంత్రుల సమావేశం-2026 విజయవంతంగా ముగిసింది. క్రీడారంగంలో సభ్య దేశాల మధ్య సహకారాన్ని మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో రూపొందించిన 'బ్రిక్స్ క్రీడా ఉమ్మడి ప్రకటన'కు సమావేశంలో ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. చర్చలు, పరస్పర గౌరవం, సమ్మిళితత్వంతో ముందుకు సాగాలని దేశాలు పునరుద్ఘాటించాయి. భారత్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బ్రిక్స్ సభ్య దేశాల క్రీడా మంత్రులు, సీనియర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

వైజాగ్, ఆగస్టు 23 (ఈవార్తలు): క్రీడల అభివృద్ధి, భవిష్యత్ సహకారంపై కీలక ప్రాధాన్యతలను చర్చించారు. సమావేశాన్ని ప్రారంభించిన కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ, కేవలం ప్రకటనలకే పరిమితం కాని బలమైన బ్రిక్స్ క్రీడా భాగస్వామ్యాన్ని నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు. "అథ్లెట్లు, కోచ్‌ల మార్పిడి, ఉమ్మడి పోటీలు, క్రీడా విజ్ఞానాన్ని పంచుకోవడం వంటి తరువాయి 2 వ పేజీలో...






# 14 దేశాలకు టీఆర్ఎస్ అధ్యక్షుల నియామకం

## పార్టీ బలోపేతం కోసమే: కల్వకుంట్ల కవిత

హైదరాబాద్, ఆగస్టు 23 (ఈవార్తలు) : విదేశాల్లో తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీ బలోపేతం కోసం 14 దేశాల్లో పార్టీ అధ్యక్షులను నియమించారు. ఈమేరకు పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. 14 దేశాలతో పాటు పార్టీ మహారాష్ట్ర శాఖ అధ్యక్షుడిని నియమించారు. ఆయా దేశాల్లో పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. వారి నియామకాలు వెంటనే అమల్లోకి తరువాయి 2 వ పేజీలో...

# 1000 రోజుల దగా

## కాంగ్రెస్ సర్కారుపై బీఆర్ఎస్ యుద్ధ భేరి

**సెప్టెంబర్ 2 నుంచి రాష్ట్రవ్యాప్త నిరసనలు.. కేటీఆర్ పిలుపు**

అడ్డగోలుగా హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి.. వంద రోజుల్లోనే 6 గ్యారంటీలను అమలు చేస్తామని చెప్పి.. తర్వాత అన్ని వర్గాల ప్రజలను నట్టేట ముంచుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి 1000 రోజులు నిండుతున్న సందర్భంగా ఆ పార్టీ మోసాన్ని ప్రజల్లో ఎండగట్టేందుకు బీఆర్ఎస్ పార్టీ పెద్ద ఎత్తున కార్యాచరణకు సిద్ధమైంది. ఇందులో భాగంగా సెప్టెంబర్ 2 నుంచి వారం రోజుల పాటు సమాజంలోని అన్ని రంగాలకు కాంగ్రెస్ పార్టీ చేసిన మోసాన్ని ప్రజల్లోకి పెద్ద ఎత్తున వినూత్నంగా తీసుకెళ్లేందుకు వివిధ కార్యక్రమాలు చేపట్టనుంది.



హైదరాబాద్, ఆగస్టు 23 (ఈవార్తలు): ఈ మేరకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్టీ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, రాష్ట్ర కమిటీతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో పలు సూచనలు, దిశానిర్దేశం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో చేసిన మోసాలు, ఇచ్చిన హామీల అమలులో వైఫల్యాలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రతి వర్గానికి చేరేలా ఈ వారం రోజుల కార్యక్రమాలను నిర్వహించాలని కేటీఆర్ సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులంతా ఏకతాటిపైకి వచ్చి కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల ముందు ఎండగట్టేలా కార్యాచరణను విజయవంతం చేయాలని తరువాయి 2 వ పేజీలో...

# అసెంబ్లీని స్తంభింపజేస్తం

**22ఏ జాబితా రద్దు చేయాల్సిందే.. హరీశ్‌రావు వార్నింగ్**

22ఏ జాబితాను వెంటనే రద్దు చేయకపోతే అసెంబ్లీని స్తంభింపజేస్తాం.. సచివాలయాన్ని ముట్టడిస్తామని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు హెచ్చరించారు. ప్రజల ఆస్తులను లాక్కుంటే కాంగ్రెస్ పార్టీ మాడి మసైపోవడం ఖాయమని అన్నారు. హైదరాబాద్ బోడుప్పల్ పరిధిలోని తిరుమల మెడోస్, లక్ష్మీ గణపతి, హేమానగర్ కాలనీలను ప్రభుత్వం అకారణంగా 22ఏ నిషేధిత జాబితా లో చేర్చిన నేపథ్యంలో.. తీవ్ర ఆందోళనలో ఉన్న ఆయా కాలనీల వాసులకు బాసటగా నిలిచేందుకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు.



హైదరాబాద్, ఆగస్టు 23 (ఈవార్తలు): ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీశ్ రావు గారు హాజరై బాధితులకు భరోసా కల్పించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి, పొంగులేటి రాష్ట్రాన్ని అడ్డం పెట్టుకుని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటే రాహుల్ గాంధీ చోద్యం చూస్తున్నారా అని ప్రశ్నించారు. 30 శాతం కమీషన్ల కోసమే పక్కా రిజిస్టర్డ్ ఇళ్లను నిషేధిత జాబితాలో పెడుతున్నారని విమర్శించారు. భూభారతి పోర్టల్ నుంచి 22ఏ జాబితాను రాత్రికి రాత్రే ఎందుకు తరువాయి 2 వ పేజీలో...

## రాశి ఫలాలు
24.8.2026

మేషం: చేపట్టిన పనులు అప్రయత్నంగా పూర్తవుతాయి. ఆర్థిక వ్యవహారాలు ఆశాజనకంగా సాగుతాయి. దీర్ఘకాలిక సమస్యల నుంచి బయటపడతారు. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగులకు నూతన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి.

వృషభం: ఇంటా బయట పరిస్థితులు కొంత నిరుత్సాహ పరుస్తాయి. శ్రమాధిక్యతతో కానీ పనులు పూర్తికావు. బంధుమిత్రుల నుండి అందిన సమాచారం ఆశ్చర్య పరుస్తుంది. అనారోగ్య సమస్యలు భాధిస్తాయి. వృధా ఖర్చులు పెరుగుతాయి. వృత్తి వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. ఉద్యోగాలలో కొద్దిపాటి చికాకులు తప్పవు.

మిధునం: చేపట్టిన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. సంతాన వివాహ విషయంలో చర్చలు సఫలం అవుతాయి. నూతన వాహనం కొనుగోలు చేస్తారు. ప్రముఖులతో పరిచయాలు విస్తృతం అవుతాయి. ఆకస్మిక ధనలాభం కలుగుతుంది. వ్యాపారాలలో కీలక నిర్ణయాలు తీసుకుంటారు.

కర్కాటకం: నిరుద్యోగులకు అధికారుల అనుగ్రహం కలుగుతుంది. సోదరులతో స్థిరాస్తి వివాదాలు తొలుగుతాయి. విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. నూతన కార్యక్రమాలను ప్రారంభిస్తారు. చేపట్టిన పనులలో కార్యసిద్ధి కలుగుతుంది. వృత్తి వ్యాపారాలలో నూతన ప్రోత్సాహకాలు అందుతాయి.

సింహం: కొన్ని వ్యవహారాలు మందగిస్తాయి. ఆర్థిక పరిస్థితి ఒడిదుడుకులుగా ఉంటుంది. దూరప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. వృత్తి ఉద్యోగాలలో అకారణ వివాదాలు కలుగుతాయి.

కన్య: దూర ప్రయాణాలు వాయిదా పడతాయి. కీలక వ్యవహారాలలో రెండు రకాలయిన ఆలోచనల వలన ఇబ్బందులు తప్పవు. బంధువులు, మిత్రులు మీ మాటతో విభేదిస్తారు. ఆరోగ్య విషయంలో అశ్రద్ధ చేయడం మంచిది కాదు. వ్యాపారాలలో నూతన పెట్టుబడులు సకాలంలో అందక ఇబ్బందులు ఎదుర్కొంటారు.

తుల: చేపట్టిన పనులు వేగవంతంగా పూర్తిచేస్తారు. చిన్ననాటి మిత్రుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. విలువైన వస్త్రాభరణాలు కొనుగోలు చేస్తారు. సంఘంలో ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. ఉద్యోగాలలో అదనపు బాధ్యత నుండి ఉపశమనం పొందుతారు. వ్యాపారాలు సంతృప్తికరంగా సాగుతాయి.

వృశ్చికం: కీలక వ్యవహారాలలో శ్రమకు తగిన ఫలితం లభిస్తుంది. అనుకున్న సమయానికి అనుకున్న విధంగా పనులు పూర్తి చేస్తారు. బంధుమిత్రులతో సఖ్యతగా వ్యవహరిస్తారు. కుటుంబ సభ్యులతో ఆలయ దర్శనాలు చేసుకుంటారు. వ్యాపారాలలో సమస్యలను అధిగమించి ముందుకు సాగుతారు. వృత్తి ఉద్యోగాలలో హోదాలు పెరుగుతాయి.

ధనస్సు: ఆర్థిక లావాదేవీలు నిరుత్సాహ పరుస్తాయి. వృధా ప్రయాణాలు చెయ్యవలసి వస్తుంది. ఇంటాబయట బాధ్యతలు మరింత చికాకు పరుస్తాయి. స్వల్ప అనారోగ్య సూచనలు ఉన్నాయి. వృత్తి వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. ఉద్యోగస్తులకు స్థాన చలన సూచనలు ఉన్నవి.

మకరం: ముఖ్యమైన పనులు వాయిదా వేయడం మంచిది. సొంత నిర్ణయాలు తీసుకోవడం మంచిది కాదు. కుటుంబ బాధ్యతలు పెరుగుతాయి. వృత్తి ఉద్యోగాలలో పని ఒత్తిడి అధికమై విశ్రాంతి లభించదు. వ్యాపారాలు కొంత నిదానంగా సాగుతాయి.

కుంభం: అనుకున్న పనులలో కార్యసిద్ధి కలుగుతుంది. ఇంటా బయట మీ మాటకి విలువ పెరుగుతుంది. ఆర్థిక పరిస్థితి గతం కంటే మెరుగవుతుంది. ప్రయాణాలలో నూతన పరిచయాలు కలుగుతాయి. వృత్తి వ్యాపారాలలో ఆశించిన ఫలితాలు పొందుతారు.

మీనం: చేపట్టిన పనులలో వ్యయప్రయాసలు అధికమవుతాయి. ఆర్థిక పరిస్థితి అనుకూలించక నూతన ఋణ ప్రయత్నాలు చేస్తారు. దూరప్రయాణాలు వలన శారీరక శ్రమ అధికమవుతుంది. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలపై దృష్టి సారించడం మంచిది. వృధా ఖర్చుల విషయంలో పునరాలోచన చెయ్యాలి. ఉద్యోగమున సహోద్యోగుల ప్రవర్తన కొంత చికాకు పరుస్తుంది.

# 1000 రోజుల దగా

మొదటి పేజీ తరువాయి

పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రజలకు అనేక హామీలు ఇచ్చి, 420 హామీలు, 13 డిక్లరేషన్లు, ఆరు డిక్లరేషన్ల పేరుతో ప్రతి ఒక్క మాటను 100 రోజుల్లోనే నెరవేరుస్తామని చెప్పి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని కేటీఆర్ అన్నారు. అయితే 1000 రోజులు పూర్తయిన తర్వాత కూడా ఒక్కటంటే ఒక్క హామీని సంపూర్ణంగా నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిన తీరును ప్రజల్లో ఎండగట్టాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయినా ఆ పార్టీ ప్రభుత్వ పరిపాలనా వైఫల్యం, అవినీతి, అరాచకాల పట్ల తెలంగాణ ప్రజలు తీవ్ర ఆగ్రహంగా ఉన్నారని అన్నారు. రాష్ట్ర ప్రజలను పట్టి పీడిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ పరిపాలనా విధానాలు, వైఫల్యాలు, అవినీతి, అరాచకాలను ప్రజల ముందుంచాలని కేటీఆర్ సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏ విధంగా ప్రజలను మోసం చేసిందో ప్రతి వర్గానికి అర్థమయ్యేలా వివరించేందుకు సెప్టెంబర్ 2 నుంచి భారీ కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. కార్యక్రమాలు కేవలం హామీల చుట్టూ కాకుండా.. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చోటుచేసుకున్న వైఫల్యాలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కూడా ప్రధానంగా ప్రస్తావించాలని సూచించారు. ఆయా వర్గాలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల తాలూకు బకాయిలను మరోసారి 'బాకీ కార్డుల' రూపంలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని కేటీఆర్ సూచించారు. రైతు కూలీలు, వృద్ధులు, మహిళలు, విద్యార్థులు, యువతకు ప్రతి నెలా ఇస్తామన్న ఆర్థిక సహాయం ఎంత మేరకు పేరుకుపోయిందో ఈ బాకీ కార్డుల ద్వారా ప్రజలకు గుర్తు చేయాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్నదాతల నుంచి ఆడబిడ్డల దాకా ప్రతి ఒక్కరినీ మోసం చేసిందని కేటీఆర్ ఆరోపించారు. ప్రతి వర్గానికి ఇచ్చిన హామీలు, వాటి అమలులో జరిగిన వైఫల్యాలు, ఆయా వర్గాలకు రావాల్సిన ప్రయోజనాలు, బకాయిల వివరాలను ప్రజల ముందుంచాలని సూచించారు. విద్యార్థులకు రూ.12 వేల కోట్లకు పైగా ఫీజులు చెల్లించకుండా, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను అటకెక్కించిన కాంగ్రెస్ ప్రభుత్వ తీరును అన్ని కాలేజీల్లో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల వద్దకు తీసుకెళ్లాలని కేటీఆర్ అన్నారు. విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభావం చూపుతున్న ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యను ప్రజల్లో విస్తృతంగా చర్చకు తీసుకురావాలని సూచించారు. యువతకు ఏ విధంగా ఉద్యోగాలు ఇవ్వకుండా, హామీలు అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందో ఇప్పటికే సరూర్ నగర్‌లో నిర్వహించిన సభ, యువ సంగ్రామ సదస్సు ద్వారా ఎండగట్టామని కేటీఆర్ గుర్తు చేశారు. ఇప్పుడు 1000 రోజుల కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యానికి సంబంధించిన కార్యాచరణలో భాగంగా మరోసారి యువతకు కాంగ్రెస్ చేసిన మోసాన్ని తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు ఇచ్చిన ఆటో డ్రైవర్లు, ఆడబిడ్డలు, అన్నదాతలు, గిరిజనులు, దళితులు, బీసీలు, ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు ఇలా ప్రతి ఒక్క వర్గాన్ని ప్రత్యేకంగా కలిసి కాంగ్రెస్ ప్రభుత్వ మోసాన్ని వారికి అర్థమయ్యేలా వివరించాలని కేటీఆర్ సూచించారు. ఒకే తరహా కార్యక్రమాలకు పరిమితం కాకుండా ఆయా వర్గాల సమస్యలకు అనుగుణంగా కార్యక్రమాలను రూపొందించాలని పేర్కొన్నారు.

## అసెంబ్లీని స్తంభింపజేస్తం

మొదటి పేజీ తరువాయి

మాయం చేశారు? పబ్లిక్ డొమైన్‌లో పెట్టాలని డిమాండ్ చేశారు. ఒక ప్రభుత్వం అనేది ప్రజల సమస్యలు పరిష్కరించాలి.. ప్రజల ఇబ్బందులు తొలగించడానికి పని చేయాలి.. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రజలకు లేని సమస్యలు సృష్టించి వారిని తీవ్ర ఇబ్బందుల పాలు చేస్తున్నారని హరీశ్‌రావు విమర్శించారు. మధ్యతరగతి కుటుంబాలు కడుపుకట్టుకుని, పచ్చడి మెతుకులు తిని, రూపాయి రూపాయి కూడబెట్టుకుని బ్యాంకుల్లో అప్పులు తెచ్చి ఇళ్లు కట్టుకుంటారని తెలిపారు. ప్రభుత్వం తన ప్రభుత్వ భూములను, ఎస్సీల అసైన్డ్ భూములను సైతం తెగనమ్ముతోందని హరీశ్‌రావు అన్నారు.. కూకట్ పల్లి హౌసింగ్ బోర్డులో ఉన్న 1000 గజాల పార్కును కూడా అమ్మకానికి పెట్టారని తెలిపారు. ఆఖరికి గుడి కట్టడానికో, బడి కట్టడానికో, దవాఖానాకో, స్మశానానికో కూడా జాగ లేని పరిస్థితి సృష్టించారని మండిపడ్డారు. మరోవైపు కూకట్ పల్లిలోని 1000 గజాల ప్రైవేటు ప్లే గ్రౌండ్‌ను కూడా ప్రభుత్వం తనదే అంటోందని అన్నారు. రాత్రికి రాత్రే ఇళ్లను యూఎల్‌సీ కింద 22ఏ లో దేనికోసం పెడుతున్నారు? ఇదంతా కేవలం 30 శాతం కమీషన్లు లాగడానికే. దళారులు వెళ్లి యజమానులను 30 శాతం కమీషన్ అడుగుతున్నారని తెలిపారు. తప్పు చేసి నిషేధిత జాబితాలో పెట్టింది మీరు.. మీ కమీషన్ల కోసం చేసిన తప్పుకు సామాన్య ప్రజలు ప్రభుత్వ ఆఫీసుల చుట్టూ ఎందుకు తిరగాలి? ఎందుకు అప్లికేషన్లు పెట్టుకోవాలి? అని ప్రశ్నించారు. ఇలా ప్రజలను ఆఫీసుల చుట్టూ తిప్పుకోవాలని ఆలోచించడమే కాంగ్రెస్ ప్రభుత్వ తుగ్లక్ చర్య అని మండిపడ్డారు.

## బంగ్లాదేశ్‌లో రిటైర్డ్ హిందూ టీచర్ కుటుంబం హత్య

మొదటి పేజీ తరువాయి

ఢాకా: బంగ్లాదేశ్‌లో అత్యంత దారుణమైన ఘటన చోటుచేసుకుంది. రంగ్‌పూర్ నగరంలో నివసిస్తున్న ఓ రిటైర్డ్ హిందూ టీచర్ కుటుంబాన్ని దుండగులు కిరాతకంగా హత్య చేశారు. డ్రగ్స్ తీసుకుంటున్న యువకులను అడ్డుకున్నందుకు వారు ఈ ఘాతుకానికి పాల్పడినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ కేసులో ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే, రంగ్‌పూర్ నగరంలోని దాస్‌పారా ప్రాంతంలో రిటైర్డ్ టీచర్ గణపతి చక్రవర్తి (65) తన కుటుంబంతో నివసిస్తున్నారు. ఆయన భార్య ప్రీతిలత (50), కుమార్తె అగామి చక్రవర్తి (23), కుమారుడు ప్రియం చక్రవర్తి (12) ఉన్నారు. స్థానిక మీడియా కథనాల ప్రకారం, గురువారం రాత్రి ఇద్దరు యువకులు డ్రగ్స్ తీసుకునేందుకు పక్క భవనం మీదుగా గణపతి ఇంటి పైకప్పుపైకి వచ్చారు. శబ్దం విని మేడపైకి వెళ్లిన గణపతి వారిని ప్రశ్నించడంతో గొడవ మొదలైంది. ఈ క్రమంలో నిందితులు ఓ తువ్వాలుతో ఆయన గొంతు నులిమి చంపేశారు. ఆ తర్వాత పైకి వచ్చిన గణపతి భార్య ప్రీతిలతను కూడా ఓ వస్త్రంతో గొంతు బిగించి హత్య చేశారు. అనంతరం కిందకు వెళ్లి వారి కుమార్తె, కుమారుడిని కూడా దారుణంగా హతమార్చారు. గురువారం నుంచి కుటుంబ సభ్యుల ఫోన్లు స్విచాఫ్ రావడంతో అనుమానం వచ్చిన బంధువులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. శుక్రవారం రాత్రి 11:30 గంటల సమయంలో పోలీసులు ఇంటి తాళాలు పగలగొట్టి చూడగా ఈ దారుణం వెలుగులోకి వచ్చింది. గణపతి మృతదేహం ఇంటి పైకప్పుపైనా, భార్య, కుమార్తె మృతదేహాలు మెట్లపైనా, కుమారుడి మృతదేహం మంచం కింద పడి ఉన్నాయి.

## మేకిన్ ఇండియా.. ప్లే ఇన్ ఇండియా

మొదటి పేజీ తరువాయి

అంశాల్లో వాస్తవ వేదికలను సృష్టించాలి" అని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ తన క్రీడా వ్యవస్థను సమూలంగా మారుస్తోందని, క్షేత్ర స్థాయి నుంచి పతకాల వేదిక వరకు అవకాశాలను సృష్టిస్తోందని మాండవీయ వివరించారు. క్రీడా వస్తువుల తయారీని బలోపేతం చేయడానికి భారత్ చేస్తున్న కృషిని ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. "మేక్ ఇన్ ఇండియా, ప్లే ఇన్ ఇండియా, గ్రో విత్ ఇండియా" నినాదంతో ప్రపంచ తయారీదారులు, టెక్నాలజీ కంపెనీలు, పెట్టుబడిదారులను భారత్‌కు ఆహ్వానిస్తున్నామని తెలిపారు. అంతకుముందు, మంత్రులు, ప్రతినిధులు విశాఖలో జరిగిన 'ఫిట్ ఇండియా సండేస్ ఆన్ సైకిల్' కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన బ్రిక్స్ ఫ్రెండ్‌షిప్ సైక్లింగ్ ఈవెంట్‌లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ఫిట్‌నెస్, ఆరోగ్యకరమైన జీవనశైలి పట్ల బ్రిక్స్ దేశాల ఉమ్మడి నిబద్ధతను ప్రతిబింబించింది. భారత్ అధ్యక్షతన క్రీడారంగంలో సాధించిన పురోగతిని సభ్య దేశాలు స్వాగతించాయి.

## 14 దేశాలకు టీఆర్ఎస్ అధ్యక్షుల నియామకం

మొదటి పేజీ తరువాయి

వస్తాయని తెలిపారు. ఆస్ట్రేలియా: కిషోర్ కత్తి, యూకే: సుమన్ రావు బాల్మూరి, కెనడా: వెంకట్రామణ్ మెట్ పల్లి, ఇటలీ: తానింకి కిషోర్ యాదవ్, మాల్టా: పింటూ ఘోష్, పోర్చుగల్: ప్రకాష్ పొన్న కంటి, యూఏఈ: శేఖర్ గౌడ్ ఆరె, కువైట్: మార్క ప్రమోద్ గౌడ్, జింబాబ్వే: బెమ్మిడి మహేందర్ రెడ్డి, ఖతార్: శేఖర్ చిలువూరి, ఫిన్లాండ్: సందీప్ రెడ్డి ఐరెడ్డి, నార్వే: ప్రసాద్ రావు బిక్కినేని, సౌదీ అరేబియా: మొజ్జం అలీ ఇఫ్తేకర్, ఐర్లాండ్: జయంత్ రెడ్డి మెట్టు, టీఆర్ఎస్ మహారాష్ట్ర శాఖ అధ్యక్షుడిగా సుల్గే శ్రీనివాస్ ను నియమించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలంగాణ బిడ్డలను ఏకం చేస్తూ, పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేయాలని సూచించారు.

## నేనొస్తున్నా..అన్నీ మాట్లాడుతా!

మొదటి పేజీ తరువాయి

రేవంత్ రెడ్డి ట్వీట్ చేశారు. కేంద్రం తీసుకున్న నిర్ణయం రాజకీయ కారణాలతోనే జరిగిందని ఆయన పేర్కొన్నారు. అమెరికా పర్యటనకు అనుమతి నిరాకరించిన అంశంలో తనకు మద్దతుగా నిలిచిన కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు రేవంత్‌రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జాతీయ ప్రయోజనాల దృష్ట్యా తనకు అండగా నిలిచిన కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు, దేశవ్యాప్తంగా తనకు మద్దతు తెలిపిన ప్రజలకు ధన్యవాదాలు చెప్పారు. లండన్‌లో తన సమావేశాలు, ముందుగా నిర్ణయించిన కార్యక్రమాలను పూర్తి చేసినట్లు రేవంత్‌రెడ్డి తెలిపారు. గత 3 రోజులుగా తనకు లభించిన మద్దతు పట్ల ఆయన కృతజ్ఞతలు వ్యక్తం చేశారు. లండన్ పర్యటన తర్వాత అమెరికాలోని బోస్టన్‌తో పాటు ఇతర నగరాల్లో పర్యటించి విద్య, నైపుణ్యాభివృద్ధి, సాంకేతికత, పెట్టుబడులు, అంతర్జాతీయ సంస్థలతో భాగస్వామ్యాలపై చర్చలు జరపాలని ఆయన తొలుత ప్రణాళిక రూపొందించారు. అమెరికా పర్యటనలో ప్రముఖ విద్యా సంస్థలతో సమావేశాలు, భాగస్వామ్య ఒప్పందాలపై చర్చలు జరపాలని తెలంగాణ ప్రభుత్వం భావించింది. అయితే రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనకు కేంద్రం పొలిటికల్ క్లియరెన్స్ ఇవ్వకపోవడంతో ముఖ్యమంత్రి షెడ్యూల్‌లో మార్పులు చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలోనే అమెరికా పర్యటన రద్దు కావడంపై ఇప్పటికే కాంగ్రెస్, కేంద్ర ప్రభుత్వాల మధ్య రాజకీయ విమర్శలు కొనసాగుతున్నాయి.

## పాతవాళ్లకే పెద్దపీట

మొదటి పేజీ తరువాయి

జరిగాయని తెలిపారు. ఇక నుంచి భర్తీ చేసే పదవుల్లో కమిట్‌మెంట్ ఉన్న కార్యకర్తలకు ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. క్రమశిక్షణ, నిబద్ధత, కష్టపడే తత్వం ప్రామాణికంగా పదవుల కేటాయింపు ఉంటుందని స్పష్టం చేశారు. గత ఐదేళ్లుగా అవిశ్రాంతంగా పనిచేసిన సీనియర్ నేతలకు సంస్థాగత పదవులలో 70 శాతం ప్రాధాన్యత ఇవ్వాలని మేము నిర్ణయించామని మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. ఇందులో ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్, క్షేత్రస్థాయి కార్యకర్తలకు మొదటి ప్రాధాన్యత లభిస్తుందని చెప్పారు. పార్టీ బలోపేతానికి, భవిష్యత్తు అవసరాలకు కొత్త నాయకత్వం కూడా అవసరమని పేర్కొన్నారు. అందుకే 20 శాతం పదవులను కొత్త నేతలకు కేటాయిస్తామని వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పార్టీ ఇన్‌ఛార్జ్‌తో సంప్రదింపులు జరిపిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. కార్యకర్తల త్యాగాలు, కృషి వల్లే తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. ప్రభుత్వంపై ప్రజల్లో సానుకూలత ఉందని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ 100 సీట్లతో మళ్లీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఇక, కాంగ్రెస్‌లో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులపై కూడా మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. కాంగ్రెస్ పార్టీలో ప్రజాస్వామ్యం, భావప్రకటన స్వేచ్ఛ ఎక్కువగా ఉంటుందని తెలిపారు. అయితే స్వేచ్ఛ ఉంది కదా అని ఇష్టానుసారం మాట్లాడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఎంతటివారైనా హద్దులు దాటితే క్షేమించేది లేదని స్పష్టం చేశారు. ఏఐసీసీలో పెద్ద పెద్ద నాయకులనే వదులుకున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి గురించి, పార్టీ గురించి అడ్డగోలుగా మాట్లాడతామంటే కుదరదని చెప్పారు. ఏదైనా ఇబ్బందులు ఉంటే చెప్పుకోవడానికి దశలవారీగా ఫోరమ్‌లు ఉన్నాయని తెలిపారు.

## పది రోజులైనా ప్రోరోగ్ చేయరేం?

మొదటి పేజీ తరువాయి

లేకుండానే, మహిళా రిజర్వేషన్ బిల్లు లేదా డీలిమిటేషన్ వంటి కీలక బిల్లులను ఆమోదించుకునేందుకు కేంద్ర ప్రభుత్వం సన్నద్ధమవుతోందా అనే ఊహాగానాలు ఊపందుకున్నాయి. 2029 పార్లమెంట్ ఎన్నికల కంటే ముందే మహిళా రిజర్వేషన్ చట్టాన్ని అమలు చేయాలని కేంద్రం పట్టుదలగా ఉన్నట్లు సమాచారం. అయితే, జనాభా ప్రాతిపదికన జరిగే నియోజకవర్గాల పునర్విభజన వల్ల లోక్‌సభలో తమ బలం తగ్గిపోతుందని దక్షిణాది రాష్ట్రాలు ఆందోళన చెందుతున్నాయి. ఈ ఆందోళనలను తగ్గించేందుకు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో లోక్‌సభ స్థానాలను ఏకరీతిగా 50 శాతం పెంచే ఫార్ములాపై ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. సమావేశాల ముగింపులో జరుగుతున్న జాప్యంపై కాంగ్రెస్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించింది. కాంగ్రెస్ సీనియర్ నేత జైరామ్ రమేశ్ ట్విట్టర్ వేదికగా స్పందిస్తూ పలు అనుమానాలు వ్యక్తం చేశారు. "లోక్‌సభను నిరవధికంగా వాయిదా వేసిన తర్వాత రెండు నుంచి నాలుగు రోజుల్లో ప్రోరోగ్ చేయడం ఆనవాయితీ. కానీ పది రోజులైనా ఎలాంటి సమాచారం లేదు. డీలిమిటేషన్‌కు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లును ప్రత్యేక సెషన్‌లో ఆమోదించుకోవడానికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఇంకా తన '2/3వ మెజారిటీ' కోసం వెతుకుతున్నారా?" అని ఆయన ప్రశ్నించారు. 2015, 2021లో కూడా సమావేశాల వాయిదాకు, ముగింపునకు మధ్య గ్యాప్ ఉన్నప్పటికీ, అప్పట్లో ఇలాంటి కుట్రపూరిత వ్యూహాలు లేవని ఆయన అన్నారు.

## బీసీ వర్సెస్ ఓసీ!

మొదటి పేజీ తరువాయి

వినిపిస్తున్నాయి. కొండా సురేఖ బీసీ నేత కావడంతో ఈ వ్యవహారానికి సామాజిక కోణం కూడా జతకడుతోంది. సురేఖపై వరుసగా విమర్శలు రావడం, మంత్రి పదవి నుంచి తొలగించాలని డిమాండ్లు రావడం, ఆమెకు ప్రత్యామ్నాయం కోసం పార్టీ ఆలోచిస్తోందన్న ప్రచారం నేపథ్యంలో బీసీ వర్గాల్లో అనుమానాలు పెరుగుతున్నాయి. ఇప్పటికే కొందరు ఓబీసీ నేతలు సురేఖకు మద్దతుగా నిలిచి, ఆమెపై కుట్ర జరుగుతోందని ఆరోపించారు. అయితే కాంగ్రెస్‌లోని మరో వర్గం మాత్రం ఇది బీసీ వర్సెస్ ఓసీ వ్యవహారం కాదని చెబుతోంది. పార్టీ అధినేతలు, ముఖ్యమంత్రి, ప్రభుత్వంపై బహిరంగంగా విమర్శలు చేస్తే.. వారు ఏ సామాజిక వర్గానికి చెందిన వారైనా క్రమశిక్షణ తప్పనిసరిగా వర్తించాలన్నదే తమ వాదనగా చెబుతోంది. కానీ రాజకీయాల్లో భావన కూడా అంతే ముఖ్యం. చర్యలు సమానంగా కనిపించకపోతే.. సామాజిక న్యాయం ప్రశ్నార్థకమవుతుంది. ఒకరిపై కఠిన చర్యలు.. మరొకరిపై మృదువైన వైఖరి కనిపిస్తే, అది చివరకు కుల సమీకరణాల కళ్లద్దాల ద్వారా రాజకీయాలను చూసే పరిస్థితిని తెస్తుందని బీసీ నేతలు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు.

### కాంగ్రెస్‌కు అసలు పరీక్ష ఇదే

కొండా సురేఖపై చర్యలు తీసుకోవాలా? వద్దా? అన్నది కాంగ్రెస్ అధిష్ఠానం తీసుకోవాల్సిన అంతర్గత నిర్ణయం. కానీ ఆ నిర్ణయం తీసుకునే విధానం మాత్రం పార్టీకి రాజకీయంగా కీలకం. ఒకే ప్రమాణాన్ని అందరికీ వర్తింపజేస్తే ఎలాంటి అనుమానాలకు తావుండదు. అదే సమయంలో వ్యక్తుల సామాజిక నేపథ్యాన్ని బట్టి పార్టీ వైఖరి మారుతోందన్న భావన కలిగితే మాత్రం బీసీ రాజకీయాల్లో దాని ప్రభావం తప్పదు.

# ఆటోవాలాల సమ్మె విరమణ

మొదటి పేజీ తరువాయి

సాయంత్రం చర్చలు జరిగాయని.. అందులో 14 అంశాలపై చర్చించామని సమ్మె విరమణ పత్రంలో పేర్కొన్నారు. ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సైతం హామీ ఇచ్చారని తెలిపారు. ఈ నేపథ్యంలోనే సమ్మె విరమిస్తున్నట్లు ప్రకటించారు. తమ సమస్యలపై ప్రభుత్వం, కార్మిక సంఘాల ప్రతినిధుల మధ్య ఆదివారం సాయంత్రం చర్చలు జరిగాయని తెలిపారు. ఆటో కార్మిక సంఘాలతో జరిగిన చర్చలు సఫలమయ్యాయని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆటో కార్మిక సంఘాల డిమాండ్స్ పట్ల ప్రభుత్వం సానుకూలంగా ఉందని చెప్పారు. ఆటో కార్మిక సంఘాలకు ప్రభుత్వం నుంచి సానుకూల అంశాలను సైతం వెల్లడించారు. ఆర్టీసీ తరఫున ఈవీ ఆటోలను కొనుగోలు చేయనున్నారన్న ప్రచారాన్ని మంత్రి ఖండించారు. అది కేవలం దుష్ప్రచారం మాత్రమేనని స్పష్టం చేశారు. ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటుకు ప్రభుత్వం అంగీకరించింది. దీనికి సంబంధించిన విధివిధానాలపై సెప్టెంబర్ 1న కార్మిక శాఖ, రవాణా శాఖ అధికారులు, ఆటో కార్మిక సంఘాల ప్రతినిధులతో సంయుక్త సమావేశం నిర్వహించనున్నారు.

ఆటో చార్జీల పెంపునకు సానుకూల నిర్ణయం

2012 తర్వాత ఆటో చార్జీలు పెంచలేదని గుర్తించిన ప్రభుత్వం.. చార్జీల పెంపునకు సూత్రప్రాయంగా అంగీకరించింది. ఎంత మేర పెంచాలన్న దానిపై నివేదిక తీసుకుని, అనంతరం సంబంధిత ఉత్తర్వులు జారీ చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఆటో కార్మికుల కోసం ఓలా, ఉబెర్ తరహాలో ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించారు. ఈ మేరకు ఐటీ శాఖ ద్వారా అవసరమైన ప్రక్రియను ప్రారంభించనున్నారు. రాపిడో, ఓలా, ఉబెర్ వంటి సంస్థల ద్వారా ద్విచక్ర వాహనాలపై ప్రయాణికుల రవాణాకు సంబంధించి ఎల్లో ప్లేట్ ఉన్న వాహనాలకే అనుమతి కల్పించే అంశంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆటో కార్మికులకు రూ.12 వేల ఆర్థిక సాయం అందించే అంశంపైనా ప్రభుత్వం సానుకూలంగా ఉందని మంత్రి తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ఇతర మంత్రులతో చర్చించిన అనంతరం నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

ఈవీ ఆటోలకు రూ.1.50 లక్షల సాయం

హైదరాబాద్‌లోని క్యూర్ ఏరియా పరిధిలో పాత డీజిల్, పెట్రోల్ ఆటోలను రెట్రోఫిట్మెంట్ ద్వారా ఎలక్ట్రిక్ ఆటోలుగా మార్చుకునే వారికి ప్రభుత్వం రూ.1.50 లక్షల వరకు ఆర్థిక సహాయం అందించనుంది. కొత్త ఆటోలు కొనుగోలు చేసేందుకు సబ్సిడీ ఇవ్వాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించినట్లు మంత్రి వెల్లడించారు. హైదరాబాద్‌లో కాలుష్యాన్ని తగ్గించి పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ఈవీ ఆటోలను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం పూర్తిగా సానుకూలంగా ఉందని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. చర్చల్లో రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి, జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ రమేశ్, జేటీసీలు చంద్రశేఖర్ గౌడ్, శివలింగయ్య, వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

# మంత్రివర్గ 'వేటు'



## కేబినెట్ విస్తరణకు ముహూర్తం?.. మంత్రి కొండా సురేఖకు ఉద్వాసన?

**క్రమశిక్షణ ఉల్లంఘనపై టీపీసీసీ చీఫ్ సీరియస్**

**కొత్త మంత్రుల రేసులో పలువురు ఆశావహులు**

**అధిష్ఠానం గ్రీన్‌సిగ్నల్ కోసం వెయిటింగ్!**

హైదరాబాద్, ఆగస్టు 23 (ఈవార్తలు): రాష్ట్రంలో ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న మంత్రివర్గ విస్తరణకు సమయం ఆసన్నమైనట్లు సమాచారం. పార్టీలో అసమ్మతి స్వరాలు వినిపిస్తున్న వేళ, దాదాపు ఏడాది కాలంగా ఊరిస్తున్న కేబినెట్ ప్రక్షాళనకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిద్ధమైనట్లు తెలుస్తోంది. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఆమె కుమార్తె సుస్మితా పటేల్‌తో పాటు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఇటీవల చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారం రేపిన నేపథ్యంలో మంత్రివర్గ విస్తరణకు మార్గం సుగమమైనట్లు వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. తాజా పరిణామాల నేపథ్యంలో మంత్రి కొండా సురేఖను కేబినెట్ నుంచి తప్పించే అవకాశం ఉన్నట్లు పార్టీ అంతర్గత వర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది. పార్టీ గీత దాటిన అసమ్మతి నేతల వ్యాఖ్యలపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్లు సమాచారం. మరోవైపు సీఎం అనుకూల ఎమ్మెల్యేలు సైతం బహిరంగంగా విలేకరుల సమావేశం నిర్వహించి మరీ మంత్రిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో ప్రభుత్వంపై తన పట్టును నిరూపించుకునేందుకు కేబినెట్ విస్తరణను రేవంత్ ఒక అస్త్రంగా వాడుకోనున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ కూడా పరోక్ష సంకేతాలిచ్చారు. రాజకీయ, సంస్థాగత హద్దులు దాటి చేసిన వ్యాఖ్యలను పార్టీ విస్మరించబోదని, ఈ అంశం ఏఐసీసీ పరిశీలనలో ఉందని స్పష్టం చేశారు. గతంలో సురేఖకు పలుమార్లు అండగా నిలిచిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సైతం ఈ వ్యవహారంలో మౌనం వహించడం గమనార్హం. రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్ కూడా ఈ ఉదంతంపై పూర్తి సమాచారం సేకరించి అధిష్ఠానానికి నివేదిక అందజేసినట్లు తెలుస్తోంది.

**కొత్త ఆశావహులు వీరే..**

ఒకవేళ కొండా సురేఖకు ఉద్వాసన పలికితే, అదే సామాజిక వర్గానికి చెందిన వారికి అవకాశం దక్కవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. మున్నూరు కాపు కోటాలో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు మంత్రి పదవి దక్కే చాన్స్ ఉంది. బీసీ కోటాలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్యేలు శంకరయ్య (షాద్‌నగర్), మఖన్‌సింగ్ రాజ్ ఠాకూర్ (రామగుండం), నవీన్ యాదవ్ (జూబ్లీహిల్స్) మంత్రి పదవుల కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. మహిళా కోటా చూస్తే ప్రస్తుతం సీతక్క మాత్రమే మంత్రిగా ఉన్నారు. ఈ కోటాలో మరో స్థానం భర్తీ చేయాల్సి వస్తే.. పద్మావతి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మట్టా రాగమయి, చిట్టెం పర్ణికారెడ్డి, మామిడాల యశస్విని పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. ప్రస్తుతం కేబినెట్‌లో రెండు స్థానాలు ఖాళీగా ఉన్నాయి. వీటికి తోడు కొత్తగా ఖాళీ అయ్యే స్థానాలను భర్తీ చేయడంతో పాటు, ప్రస్తుత మంత్రుల శాఖల్లోనూ కీలక మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది. సమర్థులైన వారికి కీలక శాఖలు అప్పగించాలని సీఎం భావిస్తున్నారు. అలాగే, 2028 అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కొందరు మంత్రులకు ప్రభుత్వ బాధ్యతల నుంచి విముక్తి కల్పించి, పార్టీ బాధ్యతలు అప్పగించే యోచనలో కూడా రేవంత్ రెడ్డి ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం.

**ఖర్గేతో సురేఖ భేటీ**

రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీ రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. త్వరలోనే మంత్రివర్గ విస్తరణ ఉంటుంది.. కేబినెట్ నుంచి కొండా సురేఖను తొలగిస్తారని వార్తలు వినిపిస్తున్న నేపథ్యంలో ఆమె ఎత్తుగడ వేసినట్టు తెలుస్తోంది. బెంగళూరులో ఏకంగా ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గేతో మంత్రి కొండా సురేఖ సమావేశమైనట్లు సమాచారం. ఆమె కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలతో పాటు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీలో చోటు చేసుకున్న పరిణామాలు, క్రమశిక్షణా కమిటీకి ఇచ్చిన వివరణపై ఖర్గేతో చర్చించినట్లు తెలుస్తోంది. ఈ సమావేశం దాదాపు గంటకు పైగా సాగినట్లు వినిపిస్తోంది. ఏది ఏమైనప్పటికీ.. తనకు మంత్రి పదవి నుంచి ఉద్వాసన పలుకుతారని వార్తలు షికారు చేస్తున్న నేపథ్యంలో ఖర్గేతో కొండా సురేఖ భేటీ కాంగ్రెస్ పార్టీ వర్గాల్లో అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది.


## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.




## భీమన్న సేవలో 40,975 మంది భక్తులు

వేములవాడ అర్బన్, ఆగస్టు 23 (ఈవార్తలు): వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. ఉదయం నుంచి సాయంత్రం 6 గంటల వరకు మొత్తం 40,975 మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల రద్దీ నేపథ్యంలో దేవస్థానం అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వివిధ సేవల్లోనూ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కోడె కట్టుట సేవలో 2,458 మంది, అభిషేకంలో 120 మంది, అన్నపూజలో 37 మంది, శివకల్యాణంలో 41 మంది, శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతంలో 8 మంది, అతిశీఘ్ర దర్శనంలో 509 మంది, వేద ఆశీర్వచనంలో 5 మంది పాల్గొన్నారు. ఈ వివరాలను ఆలయ ఈవో ఎల్. రమాదేవి ఆదేశాల మేరకు పీఆర్వో పెరిక శ్రీనివాస్ వెల్లడించారు.



## భక్తిశ్రద్ధలతో బోనాల ఉత్సవాలు

సికింద్రాబాద్, ఆగస్టు 23 (ఈవార్తలు): సనత్‌నగర్ నియోజకవర్గంలోని బన్సీలాల్‌పేట్ డివిజన్‌లో ఆదివారం బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. పలు ఆలయాల్లో భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ ముదిరాజ్, పీసీసీ ఉపాధ్యక్షురాలు డాక్టర్ కోట నీలిమ తదితరులు పూజల్లో పాల్గొన్నారు.

## విశాల్ వైద్యానికి పూర్వ విద్యార్థుల చేయూత

రాయికల్, ఆగస్టు 23 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా రాయికల్‌లోని విశ్వశాంతి హైస్కూల్‌లో 2000-01 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు సామాజిక బాధ్యతను చాటుకున్నారు. ఇటీవల గాయపడిన విశాల్ అనే యువకుడి వైద్య ఖర్చుల కోసం రూ.12 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. కష్టకాలంలో ఉన్నవారికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. స్నేహబంధంతో పాటు అవసరంలో ఉన్నవారికి సహాయం చేయాలనే ఉద్దేశంతో ఈ సాయం అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తొగిటి గోపి, గద్దె రాజేష్, తీగుళ్ల గోపి, బెజ్జంకి సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు. పూర్వ విద్యార్థులు అందించిన సహాయాన్ని పాఠశాల ప్రిన్సిపాల్ మచ్చ గంగాధర్ అభినందించారు.



## పేదింటి గృహప్రవేశానికి 'వెలిచాల' కానుక

**ఇందిరమ్మ ఇల్లు పూర్తయితే ఆడబిడ్డ ఇంటికి కొత్త వెలుగు**



కరీంనగర్, ఆగస్టు 23 (ఈవార్తలు): ఇందిరమ్మ ఇల్లు పూర్తిచేసుకుని గృహప్రవేశం చేసుకునే పేద కుటుంబాలకు తనవంతు సహాయం అందిస్తానని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు ప్రకటించారు. గృహప్రవేశం చేసుకునే ఆడబిడ్డలకు ఇండక్షన్ స్టవ్ లేదా బోళ్ల సెట్ అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని కరీంనగర్ రూరల్ మండలం చామనపల్లి నుంచి ప్రారంభించారు. చామనపల్లిలో పల్లె జగదీష్-శిరీష దంపతుల ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశానికి రాజేందర్‌రావు ముఖ్య అతిథిగా హాజరై దంపతులను అభినందించారు. తొలిసారిగా వారికి ఇండక్షన్ స్టవ్‌తో పాటు బోళ్ల సెట్‌ను అందజేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని రాజేందర్‌రావు తెలిపారు. అర్హులైన పేద కుటుంబాలకు ఇళ్లు మంజూరయ్యేలా తనవంతు కృషి చేస్తానన్నారు. రేకుల షెడ్లు లేదా అసంపూర్తి ఇళ్లతో ఇబ్బందులు పడుతున్న అర్హులకు కూడా ప్రభుత్వ సహాయం అందే అవకాశం ఉందని, వివరాల కోసం గ్రామ సర్పంచ్‌ను సంప్రదించాలని సూచించారు. ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం సందర్భంగా కుటుంబంతో ఆనందాన్ని పంచుకోవాలన్న ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు రాజేందర్‌రావు తెలిపారు. చామనపల్లిలో పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో ఆయనను సన్మానించారు. సంఘ భవన నిర్మాణానికి సహకరిస్తానని, ప్రభుత్వ పరంగా నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గౌడ సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలోనూ పాల్గొని వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఇరుకుల్ల గ్రామంలో విజయలక్ష్మి-రామ్‌రెడ్డి దంపతులకు మంజూరైన ఇందిరమ్మ ఇంటికి రాజేందర్‌రావు భూమిపూజ చేశారు. నెలలోపు నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటానని, బిల్లులు సకాలంలో అందేలా అధికారులతో సమన్వయం చేస్తానని తెలిపారు. అనంతరం బీరప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ఆలయ అభివృద్ధికి సహకరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న, చామనపల్లి సర్పంచ్ బోగొండ ఐలయ్య, కార్పొరేటర్ గుమ్మడి రాజ్‌కుమార్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, కాంగ్రెస్ నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## లిఫ్ట్‌లో ఇరుక్కుని బాలిక మృతి

**ఏపీలోని పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో ఘటన**

సత్తెనపల్లి, ఆగస్టు 23 (ఈవార్తలు): ఏపీలోని పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలో విషాదం చోటుచేసుకుంది. ఆడుకోవడానికి పక్కింటికి వెళ్లిన ఓ బాలిక లిఫ్ట్‌లో ఇరుక్కుని ప్రాణాలు కోల్పోయింది. ఈ ఘటన కొత్తపేట కాలనీలో జరిగింది. అయితే, ఇది కేవలం ప్రమాదం కాదని, తమ కుమార్తె మృతిపై అనుమానాలున్నాయని తల్లిదండ్రులు ఆరోపించడంతో పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వివరాల్లోకి వెళితే.. కొత్తపేటకు చెందిన రేవతి (12) ఆదివారం సాయంత్రం పక్కింట్లో తన స్నేహితులతో ఆడుకోవడానికి వెళ్లింది. అపార్ట్‌మెంట్‌లోని లిఫ్ట్ వద్ద ఆడుకుంటున్న సమయంలో ప్రమాదవశాత్తు అందులో ఇరుక్కుపోయింది. తీవ్ర గాయాలతో రక్తపు మడుగులో పడి ఉన్న రేవతిని చూసిన స్థానికులు వెంటనే స్పందించినా, అప్పటికే బాలిక మృతి చెందింది. ఆడుకోవడానికి వెళ్లిన తమ కుమార్తె నిమిషాల వ్యవధిలోనే విగతజీవిగా మారడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఈ ఘటనపై మృతురాలి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేస్తూ, తమ కుమార్తె మృతిపై అనుమానాలు వ్యక్తం చేశారు. కేవలం ప్రమాదవశాత్తు ఇలా జరగలేదని, దీని వెనుక వేరే కారణాలు ఉండవచ్చని ఆమె ఆరోపించారు. దీంతో ఈ ఘటనకు కొత్త కోణం తోడైంది. ఆ ఇంట్లో లిఫ్ట్ ను కొన్నిరోజుల కిందటే ఏర్పాటు చేశారు. తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు రంగప్రవేశం చేశారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి, అనుమానాస్పద మృతి (సెక్షన్ 174 సీఆర్పీసీ) కింద కేసు నమోదు చేశారు. అపార్ట్‌మెంట్‌లోని సీసీటీవీ ఫుటేజీని స్వాధీనం చేసుకుని పరిశీలిస్తున్నారు. ప్రమాదం జరిగిన తీరుపై స్థానికులను, రేవతితో పాటు ఆడుకుంటున్న ఇతర పిల్లలను విచారిస్తున్నారు. ఇది కేవలం లిఫ్ట్ వైఫల్యం వల్ల జరిగిన ప్రమాదమా లేక దీని వెనుక మరేదైనా కుట్ర కోణం ఉందా అనే దిశగా పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు.

## ఫ్రాంక్ మెసేజ్‌తో దొరికిపోయారు

హైదరాబాద్, ఆగస్టు 23 (ఈవార్తలు): సరదాగా చేసిన ఒక పని ముగ్గురు యువకులను చిక్కుల్లో పడేసింది. మద్యం మత్తులో ప్రియురాలికి "నన్ను కిడ్నాప్ చేశారు" అని పంపిన ఒక 'ప్రాంక్ మెసేజ్', చివరకు వారి ఫ్లాట్‌లో దాచిన భారీ బెట్టింగ్ సొమ్మును బయటపెట్టింది. ఈ ఘటన హైదరాబాద్‌లోని కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది. ఆంధ్రప్రదేశ్‌లోని చంద్రగిరి ప్రాంతానికి చెందిన దేశినేని సుమంత్, మాకాటి మనోజ్, కనుమూరి గౌతమ్ కేపీహెచ్‌బీలోని 'ఇండిస్ వన్ సిటీ' గేటెడ్ కమ్యూనిటీలో ఒక ఫ్లాట్‌లో నివసిస్తున్నారు. శుక్రవారం రాత్రి పార్టీ చేసుకున్న వీరు మద్యం సేవించారు. ఈ క్రమంలో సుమంత్, తన ప్రియురాలికి సరదాగా 'నన్ను ఎవరో కిడ్నాప్ చేశారు' అంటూ ఒక సందేశం పంపించాడు. ఆ మెసేజ్ చూసి ఆందోళన చెందిన సదరు యువతి, వెంటనే డయల్ 112కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం అందించింది. దీంతో ఎస్ఐ రాజు నేతృత్వంలోని పెట్రోలింగ్ బృందం హుటాహుటిన వారు నివసిస్తున్న ఫ్లాట్‌కు చేరుకుంది. అక్కడ సుమంత్ క్షేమంగా ఉండటాన్ని గమనించిన పోలీసులు, అది కిడ్నాప్ డ్రామా అని నిర్ధారించుకున్నారు. అయితే, అనుమానంతో ఫ్లాట్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేయగా, ఒక సూట్‌కేస్‌లో దాచిన రూ. 30 లక్షల నగదును పోలీసులు గుర్తించారు. ఆ నగదుకు సంబంధించి యువకులు పొంతనలేని సమాధానాలు చెప్పడంతో పోలీసులకు అనుమానం బలపడింది. వారి ఫోన్లను పరిశీలించగా, క్రికెట్ బెట్టింగ్‌కు సంబంధించిన వ్యవహారాలు నడుపుతున్నట్లు పక్కా ఆధారాలు లభించాయి. నిందితుల్లో మనోజ్ అసిస్టెంట్ ఫిల్మ్ డైరెక్టర్‌గా, గౌతమ్ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్‌గా పనిచేస్తుండగా, సుమంత్ క్రికెట్ బెట్టింగ్‌తో సంబంధాలు కలిగి ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. వెంటనే ముగ్గురినీ అదుపులోకి తీసుకున్న పోలీసులు, నగదును స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## సురేఖను కాపాడలేను: టీపీసీసీ చీఫ్

హైదరాబాద్, ఆగస్టు 23 (ఈవార్తలు): తెలంగాణ కాంగ్రెస్‌లో మంత్రి కొండా సురేఖ, ఆమె కుమార్తె సుస్మిత వ్యాఖ్యల వివాదం మరింత ముదురుతోంది. ఈ వ్యవహారంపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. గతంలో అవకాశం ఉన్నప్పుడు సురేఖను కాపాడానని, కానీ ఇప్పుడు ఆమెను కాపాడే పరిస్థితి లేదని తేల్చిచెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలు పార్టీ లైన్ దాటాయని ఆయన స్పష్టం చేశారు. నిజామాబాద్‌తో పాటు పలుచోట్ల మీడియాతో మాట్లాడిన మహేశ్ గౌడ్, సుస్మిత వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణిస్తున్నామని తెలిపారు. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించి మాట్లాడిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇప్పటికే మంత్రి కొండా సురేఖకు షోకాజ్ నోటీసులు జారీ చేశామని, ఆమె ఇచ్చే వివరణను బట్టి తదుపరి చర్యలు ఉంటాయని వివరించారు. ఈ వ్యాఖ్యలు పార్టీకి, ప్రభుత్వానికి నష్టం కలిగించేలా ఉన్నాయని, వీటిని ఉపేక్షించేది లేదని అన్నారు. మరోవైపు, టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ అధ్యక్షుడు మల్లు రవి నేతృత్వంలో శనివారం గాంధీ భవన్‌లో సమావేశం జరిగింది. కొండా సురేఖ సమర్పించిన వివరణను కమిటీ పరిశీలించింది. కుమార్తె వ్యాఖ్యలు వ్యక్తిగతమని సురేఖ చెప్పినప్పటికీ, కమిటీ దానితో ఏకీభవించలేదు. మంత్రిగా ఉన్న సురేఖ ఆ వ్యాఖ్యలను ఖండించకపోవడం తప్పని అభిప్రాయపడింది. అయితే, తుది నిర్ణయం తీసుకోకుండా మరిన్ని సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించింది. ఇదే సమయంలో, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ధ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు పార్టీ లైన్ దాటలేదని మహేశ్ గౌడ్ స్పష్టం చేయడం గమనార్హం. కేవలం సురేఖ కుమార్తె వ్యాఖ్యలపైనే పార్టీ తీవ్రంగా దృష్టి సారించినట్లు ఆయన మాటల ద్వారా వెల్లడైంది.

## సర్కారు బడులపై అబద్ధాలు: జగన్

తాడేపల్లి, ఆగస్టు 23 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లో పాఠశాల విద్యా రంగంపై వైసీపీ అధినేత జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల నుంచి విద్యార్థులు భారీగా తగ్గిపోతున్నారని, కూటమి ప్రభుత్వం మాత్రం అబద్ధపు ప్రచారాలు చేసుకుంటోందని విమర్శించారు. ఈ మేరకు కేంద్ర విద్యాశాఖకు చెందిన యూడైస్ ప్లస్ గణాంకాలను ఉటంకిస్తూ సోషల్ మీడియా వేదికగా ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రైవేటు పాఠశాలల నుంచి 1.10 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో చేరారని ప్రచారం చేసుకోవడంపై జగన్ మండిపడ్డారు. ఇది వాస్తవమైతే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరగాలి కదా? అని ప్రశ్నించారు. కానీ, యూడైస్ గణాంకాల ప్రకారం 2023-24 విద్యా సంవత్సరంతో పోలిస్తే, 2025-26 నాటికి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 40,50,116 నుంచి 34,93,450కి పడిపోయిందని, అంటే ఏకంగా 5,56,666 మంది విద్యార్థులు తగ్గిపోయారని జగన్ పేర్కొన్నారు. ఇదే సమయంలో ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 45,53,380 నుంచి 48,40,296కు పెరిగిందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల సంఖ్య కూడా 45 వేల నుంచి 44,222కు తగ్గిందని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీకి నారాయణ, శ్రీచైతన్య వంటి కార్పొరేట్ విద్యా సంస్థలతో ఉన్న సంబంధాల కారణంగానే, ప్రభుత్వ విద్యా వ్యవస్థను ఉద్దేశపూర్వకంగా బలహీనపరుస్తున్నారని జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు. తద్వారా ప్రైవేటు సంస్థలకు లబ్ధి చేకూర్చేందుకు చంద్రబాబు ప్రభుత్వం బాటలు వేస్తోందని అనుమానం వ్యక్తం చేశారు. తమ హయాంలో విద్యా రంగంలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చామని జగన్ గుర్తుచేశారు. 'మనబడి నాడు-నేడు' కింద రూ.8,524 కోట్లతో పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించామని, విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో ట్యాబ్‌లు, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్, స్మార్ట్ టీవీలు ఏర్పాటు చేశామని వివరించారు. ఆంగ్ల మాధ్యమాన్ని ప్రోత్సహిస్తూ టోఫెల్ వంటి అంతర్జాతీయ స్థాయి శిక్షణకు సైతం శ్రీకారం చుట్టామని తెలిపారు. కానీ నేడు కూటమి ప్రభుత్వంలో ప్రభుత్వ విద్యారంగం తిరోగమనంలో పయనిస్తుండటం ఆందోళనకరమని జగన్ అన్నారు. ప్రభుత్వ ప్రచారంలోని డొల్లతనాన్ని ఈ లెక్కలే బయటపెడుతున్నాయని ఆయన పేర్కొన్నారు.

## ఏపీ మాజీ మంత్రి కారుమూరి అరెస్ట్

హైదరాబాద్, ఆగస్టు 23 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ మద్యం రవాణా కుంభకోణం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావును ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు ఆదివారం అరెస్ట్ చేశారు. హైదరాబాద్‌లోని కొండాపూర్‌లో ఆయనను అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో ఇప్పటికే ముగ్గురు నిందితులు అరెస్ట్ కాగా, తాజాగా కారుమూరి అరెస్ట్‌తో దర్యాప్తు కీలక దశకు చేరుకుంది. ఇటీవల కారుమూరి నాగేశ్వరరావు దాఖలు చేసుకున్న ముందస్తు బెయిల్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసిన విషయం తెలిసిందే. జూలై 29న ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన సర్వోన్నత న్యాయస్థానం, ఈ స్కామ్ విలువ రూ.350 కోట్లకు పైగా ఉందని వ్యాఖ్యానిస్తూ, కస్టోడియల్ విచారణ అవసరమని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలోనే ఈడీ అధికారులు కారుమూరిని అరెస్ట్ చేసినట్లు తెలుస్తోంది. గత ప్రభుత్వ హయాంలో ఏపీలో మద్యం రవాణా టెండర్ల ప్రక్రియలో భారీగా అవకతవకలు జరిగాయన్నది ప్రధాన ఆరోపణ. టెండర్ నిబంధనలను ఉద్దేశపూర్వకంగా మార్చి, సిగ్మా సప్లై చైన్ సొల్యూషన్స్, ప్రసాద్ ట్రాన్స్‌పోర్ట్స్ వంటి సంస్థలకు అనుకూలంగా వ్యవహరించారని ఈడీ తన దర్యాప్తులో గుర్తించింది. ఎక్కువ ధరకు కాంట్రాక్టులు కట్టబెట్టడం సుమారు రూ.195.33 కోట్ల నష్టం వాటిల్లినట్లు ఏపీ సీఐడీ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ విచారణ కొనసాగిస్తోంది.


VANGS
GLOBAL TECHNOLOGIES LLP
15 Days Free Trial
Launch Your Own Digital Newspaper Today
Complete ePaper & News Portal Solution
The Daily News
Global Economy Shows Strong Growth in 2024
City Marathon Sets New Record
BREAKING NEWS • BREAKING NEWS •
CLOUD HOSTING
ePaper Only Pricing
Starter
ePaper Only
10 GB Storage
₹17,999 / Year
★ Most Popular
Professional
ePaper Only
20 GB Storage
₹19,999 / Year
Enterprise
ePaper Only
30 GB Storage
₹21,999 / Year
News Module Add-on: +₹6,000 Extra
Includes full News Portal with all features
Powerful Features
Unlimited News
Unlimited Gallery
Unlimited Web Stories
Unlimited Traffic
SEO Ready
Custom Domain
Push Notifications
Single Click PDF Upload
ePaper Publishing
Breaking News
Live Updates
Custom Menu
Custom Theme
ID Card Designer
Employee News App
Category Management
Heat Track for News Reports & Admin
Multiple Language Support – Yes for All Platforms
ePaper Only Starting from
₹1,799 /month*
Book Free Demo
Start Your 15 Days Free Trial Today
https://vangstechnologies.com
hr@vangstechnologies.com
+91 7675087378

గడుసు పోరడు అంటే కేవలం మొండివాడు కాదు. తనకు తానే ఒక దారి వేసుకుని నడిచేవాడు. భయపడకుండా మాట్లాడేవాడు. నచ్చకపోతే 'నో' చెప్పేవాడు. అన్యాయం అనిపిస్తే ఎదురు తిరిగేవాడు. తన నిర్ణయానికి తానే బాధ్యత వహించేవాడు. ఉడుకు రక్తంతో ముందుకు దూసుకెళ్లేవాడు. అవసరమైతే నష్టాన్ని భరించేందుకు కూడా సిద్ధపడేవాడు. అలాంటి లక్షణాలే ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా జెన్ జీ తరంలో కనిపిస్తున్నాయి. ఇది కేవలం ఒక తరానికి సంబంధించిన మార్పు కాదు. సమాజం ఆలోచించే విధానంలో వస్తున్న ఒక పెద్ద పరిణామం. గత తరాలు 'ఏం జరుగుతుందో?' అని ఆలోచించి అడుగు వేస్తే.. జెన్ జీ 'ఎందుకు జరగకూడదు?' అని ప్రశ్నిస్తోంది. గత తరాలు అవకాశాన్ని కోల్పోతామేమోనని భయపడితే.. ఈ తరం 'మరొక అవకాశం చూసుకుందాం' అంటోంది. ఉద్యోగం నచ్చకపోతే వదిలేయడానికి వెనుకాడదు. సంబంధం నచ్చకపోతే దూరమవుతుంది. వ్యవస్థ నచ్చకపోతే ప్రశ్నిస్తుంది.

నాయకత్వం నచ్చకపోతే తిరస్కరిస్తుంది. తమ జీవితంపై నిర్ణయం తీసుకునే హక్కు తమకే ఉందని బలంగా నమ్ముతోంది. అందుకే జెన్ జీని అర్థం చేసుకోవడం అంత సులభం కాదు. జెన్ జీని విమర్శించేవారు మొదట చెప్పేది ఒకటే.. 'ఈ పిల్లలకు ఓపిక లేదు' అని. కొంతవరకు అది నిజమే కావచ్చు. కానీ ఆ ఓపిక లేకపోవడం వెనుక కారణం ఏమిటన్నది కూడా చూడాలి. ఇప్పటి యువత చిన్నప్పటి నుంచే ప్రపంచాన్ని చేతిలో పెట్టుకుని పెరిగింది. ఒకప్పుడు ఒక వార్త తెలుసుకోవడానికి మరుసటి రోజు పత్రిక కోసం ఎదురుచూడాల్సి వచ్చేది. ఇప్పుడు ప్రపంచంలో ఎక్కడ ఏం జరిగినా క్షణాల్లో తెలుసుకుంటున్నారు. ఒకప్పుడు ఒక వ్యక్తిని కలవాలంటే ప్రయాణం చేయాల్సి వచ్చేది. ఇప్పుడు వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న వ్యక్తితో క్షణాల్లో మాట్లాడుతున్నారు. ఒకప్పుడు ఉద్యోగం కోసం ఒక సంస్థ గడప తొక్కాల్సి వచ్చేది. ఇప్పుడు ప్రపంచంలోని సంస్థల గురించి తెలుసుకుని, అక్కడి ఉద్యోగాల కోసం నేరుగా దరఖాస్తు చేస్తున్నారు. సమాచారం వేగం పెరిగింది. అవకాశాల పరిధి పెరిగింది. ప్రపంచంతో పరిచయం పెరిగింది. దాంతో సహజంగానే ప్రశ్నించే స్వభావం కూడా పెరిగింది.

(ఈవార్తలు - స్పెషల్ స్టోరీ)



# గడుసు పోరగాళ్లు!

## మొండివాళ్లు కాదు.. దారిని సృష్టించేవాళ్లు

'నాకు నచ్చలేదు' అంటే నచ్చలేదనే చెప్తారు..
ఇది తప్పు అనిపిస్తే తప్పేనంటారు..
నచ్చకపోతే ఎంత పెద్దవాడైనా తలవంచరు..
ప్రశ్నిస్తారు.. ఎదిరిస్తారు.. అవసరమైతే పోరాడతారు..
నిన్నటి తరాలకు ఇది మొండితనంగా కనిపించవచ్చు.
పెద్దల మాట వినని తత్వంగా అనిపించవచ్చు.
అలా అని వాళ్లకు భయం లేదని కాదు..
దాన్ని బాటగా చేసుకునే 'గడుసు పోరగాళ్లు' వాళ్లు!

### తిరుగుబాటు కాదు.. కొత్త ఆలోచనావిధానం

ఎందుకు ఇలా? ఎందుకు చేయాలి? దీని వల్ల నాకు ప్రయోజనం ఏమిటి? ఇది సరైనదేనా? ఇలాంటి ప్రశ్నలు ఇప్పుడు తిరుగుబాటు కాదు. కొత్త తరం ఆలోచనా విధానంలో భాగం. పెద్దలు చెప్పారని నమ్మడం కంటే.. ఎందుకు చెప్పారో తెలుసుకోవాలని కోరుకోవడం ఈ తరంలో బలపడింది. సంస్థలో పనిచేస్తున్నానని యాజమాన్యం చెప్పిన ప్రతి మాటను అంగీకరించాల్సిన అవసరం లేదని భావిస్తోంది. రాజకీయ నాయకుడు చెప్పాడని నమ్మడం లేదు. సామాజిక మాధ్యమాల్లో ఎవరో రాశారని గుడ్డిగా అనుసరించడం లేదు. తనకు సరైనదని అనిపిస్తేనే అంగీకరిస్తోంది. ఇది కొందరికి గడుసుతనం. మరికొందరికి బాధ్యతారాహిత్యం. కానీ ఇంకొందరికి మాత్రం ఇదే స్వేచ్ఛా ఆలోచనకు సంకేతం.



## నచ్చకపోతే నో చెప్తారు.. అన్యాయాన్ని ఎదురిస్తారు

## ఇదే 'జెన్ జీ' సిద్ధాంతం.. ప్రపంచ దేశాల జపం

### ఉడుకు రక్తం.. పెద్ద కలలు

యువతలో ఉడుకు రక్తం ఉండటం కొత్త విషయం కాదు. ప్రతి తరంలోనూ యువతే మార్పుకు చోదకశక్తిగా నిలిచింది. కానీ జెన్ జీ విషయంలో ఒక ప్రత్యేకత ఉంది. ప్రపంచం మొత్తం వారి ముందు ఒకే తెరపై కనిపిస్తోంది. అమెరికాలో ఏదైనా ఉద్యమం జరిగితే హైదరాబాద్‌లోని యువకుడికి కూడా తెలుసు. యూరప్‌లో కొత్త సాంకేతిక పరిజ్ఞానం వస్తే పల్లెలోని విద్యార్థి కూడా దాని గురించి తెలుసుకో గలడు. దక్షిణ కొరియాలో కొత్త వ్యాపార నమూనా విజయవంతమైతే మన పిలగాడు దాన్ని పరిశీలిం చగలడు. ఆఫ్రికాలోని ఒక చిన్న దేశంలో యువత ప్రభుత్వ విధానాన్ని ప్రశ్నిస్తే.. ఆ వీడియో మన యువత ఫోన్లో కనిపిస్తుంది. ప్రపంచం చిన్నదైంది. పోలికలు పెరిగాయి. అవకాశాలపై అవగాహన పెరిగింది. అందుకే 'ఇంతే నా జీవితం' అనే భావన ఈ తరంలో తగ్గుతోంది. 'నేను ఇంకా పెద్దగా చేయగలను' అనే నమ్మకం పెరుగుతోంది. అది కొన్నిసార్లు అతి విశ్వాసంగా మారుతుంది. అనుభవం లేని వయసులో పెద్ద నిర్ణయాలు తీసుకునే పరిస్థితులకు దారి తీస్తుంది. కానీ అదే ధైర్యం కొత్త ఆలోచనలకు, కొత్త వ్యాపారాలకు, కొత్త ఉద్యమాలకు, కొత్త సాంకేతికతలకు బీజం వేస్తోంది.

### భవిష్యత్తుపై భయం లేదా?

జెన్ జీపై మరో విమర్శ.. 'వారికి భవిష్యత్తుపై భయం లేదు' అని. నిజానికి భయం లేదని చెప్పడం కంటే.. భయాన్ని వేరే విధంగా చూస్తున్నారు అనడం సరైనది. ఒక ఉద్యోగాన్ని కోల్పోవడం అంటే జీవితమే ముగిసిపోయిందని భావించే తరం ఇది కాదు. ఒక సంస్థ నుంచి బయటకు వస్తే మరో సంస్థ ఉంటుంది. ఒక వ్యాపారం విఫలమైతే మరో ఆలోచన ప్రయత్నించవచ్చు. ఒక నగరంలో అవకాశం లేకపోతే మరో నగరానికి వెళ్లవచ్చు. దేశంలో అవకాశం లేకపోతే విదేశాలను పరిశీలించవచ్చు. ప్రపంచం వారికి ఒకే తలుపుగా కనిపించడం లేదు. అనేక తలుపులున్న భవనంలా కనిపిస్తోంది. అందుకే రిస్క్ తీసుకోవడానికి వెనుకాడటం లేదు. అయితే ఇదే లక్షణం ప్రమాదకరమైన దారులకూ తీసుకెళ్లే అవకాశం ఉంది. 'నాకు ఏం కాదు' అనే ధైర్యం ఒక్కోసారి నిర్లక్ష్యంగా మారవచ్చు. సామాజిక మాధ్యమాల్లో కనిపించే విజయగాథలను చూసి వాస్తవ జీవితంలోని కష్టాలను తక్కువగా అంచనా వేయవచ్చు. ఒక్క రాత్రిలోనే విజయాన్ని అందుకోవాలనే తొందర పెరగవచ్చు. కాబట్టి ఈ తరానికి ధైర్యం ఎంత అవసరమో.. అంతే అవసరం వివేకం. మొండితనం ఎంత అవసరమో.. అంతే అవసరం బాధ్యత. 'నో' చెప్పే స్వేచ్ఛ ఎంత అవసరమో.. ఎప్పుడు 'నో' చెప్పాలో తెలుసుకోవడం కూడా అంతే ముఖ్యం.

### దేశాలను కదిలిస్తున్న యువత

ఇటీవలి ప్రపంచ పరిణామాలను గమనిస్తే ఒక విషయం స్పష్టమవుతుంది. యువత ఇక ప్రేక్షకులుగా ఉండాలని కోరుకోవడం లేదు. రాజకీయాల్లోనూ, సామాజిక ఉద్యమాల్లోనూ, ఉద్యోగ రంగంలోనూ, విద్యా వ్యవస్థలోనూ తమ గొంతు వినిపించాలనుకుంటోంది. ప్రపంచంలోని అనేక దేశాల్లో యువత ప్రభుత్వాలను ప్రశ్నించింది. పాలనా విధానాలను వ్యతిరేకించింది. అవినీతిపై గళమెత్తింది. ఉద్యోగాలు, విద్య, జీవన వ్యయం, స్వేచ్ఛ, సామాజిక న్యాయం వంటి అంశాలపై వీధుల్లోకి వచ్చింది. ఎక్కడైనా వ్యవస్థ తమ భవిష్యత్తును ప్రభావితం చేస్తుందని భావిస్తే అక్కడ యువత స్పందిస్తోంది. ఇది కేవలం ఒక దేశానికి పరిమితమైన పరిణామం కాదు. వివిధ దేశాల్లో రూపాలు వేరైనా.. ప్రశ్న ఒకటే. 'మా జీవితాల గురించి నిర్ణయం తీసుకునే ముందు మా మాట ఎందుకు వినరు?' ఈ ప్రశ్నే జెన్ జీ రాజకీయ, సామాజిక ప్రవర్తనకు కేంద్రబిందువుగా మారుతోంది. వారు సిద్ధాంతాల కంటే ఫలితాలను ఎక్కువగా చూస్తున్నారు. పార్టీ కంటే పనితీరును ప్రశ్నిస్తున్నారు. హామీ కంటే అమలును చూస్తున్నారు. మాటల కంటే తమ జీవితంపై పడే ప్రభావాన్ని గమనిస్తున్నారు. అందుకే ఏ రాజకీయ పార్టీ అయినా ఈ తరాన్ని సులభంగా తమ వైపు తిప్పుకోవడం అంత ఈజీ కాదు.

### పల్లె నుంచి ప్రపంచం వరకు..

తెలంగాణ పల్లెల్లో 'గడుసు పోరడు' అన్న పదానికి ఒక ప్రత్యేకమైన మట్టి వాసన ఉంది. అది పూర్తిగా ప్రతికూల పదం కాదు. ప్రేమలోనూ ఉంటుంది. గర్వంలోనూ ఉంటుంది. కోపంలోనూ ఉంటుంది. సాహసంలోనూ ఉంటుంది. పెద్దలు మందలిస్తే 'నాకు తెలుసు' అని చెప్పే పోరడు. పొలంలో పని చేయుమంటే మరో కొత్త మార్గం ఆలోచించే పోరడు. అన్యాయం జరిగితే 'ఎందుకు ఊరుకోవాలి?' అని ప్రశ్నించే పోరడు. తనకు నచ్చిన పని కోసం ఎంత దూరమైనా వెళ్లే పోరడు. ఆ గడుసుతనంలోనే తెలంగాణ యువత ప్రత్యేకత ఉంది. ఈరోజు అదే గడుసుతనం డిజిటల్ ప్రపంచంలో కొత్త రూపం దాల్చింది. పల్లెలో సైకిల్‌పై తిరిగే యువకుడి చేతిలో ఇప్పుడు ప్రపంచాన్ని మార్చగలిగే స్మార్ట్‌ఫోన్ ఉంది. ఇంటి ముంగిట కూర్చున్న యువతి ప్రపంచంలోని ఏ సంస్థకైనా పని చేయగలుగుతోంది. చిన్న పట్టణంలో ఉన్న విద్యార్థి ప్రపంచంలోని ప్రముఖ విశ్వవిద్యాలయాల కోర్సులను నేర్చుకోగలుగుతున్నాడు. పల్లె నుంచి వచ్చిన యువకుడు ప్రపంచ మార్కెట్‌కు ఉత్పత్తిని అమ్మగలుగుతున్నాడు. అందుకే జెన్ జీని కేవలం 'ఫోన్ పట్టుకున్న తరం'గా చూడటం చాలా చిన్నచూపు. ఇది అవకాశాలను ప్రపంచ స్థాయిలో చూసే తరం.

### తప్పులు చేస్తారు.. కానీ ప్రయత్నిస్తారు

ఈ తరంలో లోపాలు లేవని చెప్పడం కూడా తప్పే. వారిలో అసహనం ఉంది. త్వరగా ఫలితం రావాలనే తొందర ఉంది. సామాజిక మాధ్యమాల ప్రభావం ఎక్కువ. ఒక్కోసారి వాస్తవం కంటే చూపించే జీవితానికే ప్రాధాన్యం ఇస్తారు. అనుభవం తక్కువగా ఉండి పెద్ద నిర్ణయాలు తీసుకుంటారు. విమర్శను స్వీకరించడంలో ఇబ్బంది పడే సందర్భాలూ ఉన్నాయి. కానీ గత తరాలకూ లోపాలు ఉన్నాయి. తేడా ఒక్కటే. గత తరాలు తమ తప్పులను నిశ్శబ్దంగా మోశాయి. ఈ తరం వాటిని బహిరంగంగా చర్చిస్తోంది. గత తరాలు 'జీవితం ఇలాగే ఉంటుంది' అని అనుకున్న సందర్భాలు ఎన్నో. ఈ తరం 'ఎందుకు ఇలాగే ఉండాలి?' అని అడుగుతోంది. ఆ ప్రశ్నను తప్పుగా చూడకూడదు. ఎందుకంటే ప్రతి పెద్ద మార్పు ముందు ఒక చిన్న ప్రశ్నతోనే మొదలవుతుంది.

### తల్లిదండ్రులకు సవాల్

జెన్ జీని అర్థం చేసుకోవడం తల్లిదండ్రులకు కూడా ఒక పెద్ద సవాల్. 'మా కాలంలో ఇలా ఉండేది' అనే మాటకు ఈ తరం పెద్దగా విలువ ఇవ్వదు. ఎందుకంటే వారి కాలం, మన కాలం ఒకటే కాదు. మనకు ఉద్యోగం అంటే భద్రత. వారికి ఉద్యోగం అంటే ఒక ఎంపిక. మనకు ఇల్లు అంటే స్థిరత్వం. వారికి ప్రపంచమే ఇల్లు కావచ్చు. మనకు ఒకే వృత్తిలో జీవితాంతం కొనసాగడం విజయానికి సంకేతం. వారికి తరచుగా రంగులు మార్చడం, కొత్త నైపుణ్యాలు నేర్చుకోవడం కూడా విజయమే. మనకు విఫలం అవడం పరువు పోవడం. వారికి విఫలం అవడం నేర్చుకునే ప్రక్రియ. ఇక్కడే తరాల మధ్య సంభాషణ అవసరం. జెన్ జీకి పెద్దలు అవసరం లేదని కాదు. వారికి ఆదేశాలు ఇచ్చే పెద్దలు కాకుండా.. మార్గం చూపే పెద్దలు కావాలి. వారి రెక్కలు కత్తిరించకుండా.. ఎగరడానికి దిశ చూపాలి. వారి ప్రశ్నలను అణచకుండా.. ప్రశ్నించే విధానాన్ని నేర్పాలి. వారి ధైర్యాన్ని తగ్గించకుండా.. దానికి బాధ్యతను జోడించాలి.

### ఉద్యోగ ప్రపంచానికీ హెచ్చరిక

జెన్ జీ మార్పు ప్రభావం ఉద్యోగ రంగంలో మరింత స్పష్టంగా కనిపిస్తోంది. ఇక కేవలం జీతం ఇచ్చి ఉద్యోగిని ఎక్కువకాలం సంస్థలో ఉంచడం కష్టమే. పని వాతావరణం, గౌరవం, ఎదుగుదల, నేర్చుకునే అవకాశాలు, వ్యక్తిగత జీవితానికి సమయం.. ఇవన్నీ వారికి ముఖ్యమే. 'ఇక్కడ ఇలాగే ఉంటుంది' అనే సమాధానాన్ని వారు అంగీకరించకపోవచ్చు. ఒక సంస్థ ఉద్యోగులను మనుషులుగా కాకుండా కేవలం వనరులుగా చూస్తే.. ఈ తరం ఎక్కువకాలం అక్కడ ఉండకపోవచ్చు. ఇది సంస్థలకు ఒక హెచ్చరిక. కొత్త తరాన్ని మార్చాలని ప్రయత్నించడంకంటే.. సంస్థలు కూడా మారాలి. జెన్ జీ రాజకీయాలను కూడా మార్చే శక్తి కలిగిన తరం. వారిని కేవలం సామాజిక మాధ్యమాల ద్వారా ఆకర్షించవచ్చని రాజకీయ పార్టీలు భావిస్తే అది పొరపాటు. వీడియో వైరల్ చేయడం ఒకటి. వారి జీవితాల్లో మార్పు తీసుకురావడం మరోటి. ఉద్యోగం కావాలి. నాణ్యమైన విద్య కావాలి. మెరుగైన ప్రజా రవాణా కావాలి. పారదర్శక పాలన కావాలి. అవినీతి తగ్గాలి. అవకాశాలు పెరగాలి. పర్యావరణం కాపాడాలి. భవిష్యత్తు భద్రంగా ఉండాలి. ఇవి జెన్ జీ అడిగే ప్రశ్నలు. వారిని నినాదాలతో ఎక్కువకాలం మోసం చేయడం కష్టం. ఎందుకంటే వారి చేతిలో సమాచారం ఉంది. పోల్చుకునే అవకాశం ఉంది. ప్రశ్నించే వేదిక ఉంది. ప్రత్యామ్నాయం వెతికే సామర్థ్యం ఉంది. అందుకే రాబోయే రాజకీయాల్లో యువతను ఆకర్షించడం కంటే.. యువతను నమ్మించే పాలన ఇవ్వడం ముఖ్యం.

### ఈ గడుసుతనం దేశానికి కావాలి

జెన్ జీపై ఎంత విమర్శ ఉన్నా.. దేశానికి వారి ధైర్యం అవసరం. పాత పద్ధతులను ప్రశ్నించే ధైర్యం కావాలి. కొత్త సాంకేతికతను స్వీకరించే సాహసం కావాలి. ప్రపంచంతో పోటీ పడే ఆత్మవిశ్వాసం కావాలి. విఫలమైతే మళ్లీ ప్రయత్నించే పట్టుదల కావాలి. అవసరమైతే 'ఇది సరైంది కాదు' అని చెప్పే గళం కావాలి. దేశం అభివృద్ధి చెందాలంటే కేవలం విధేయులైన పౌరులు సరిపోరు. ప్రశ్నించే పౌరులు కూడా కావాలి. ప్రశ్నించే యువత ఉంటేనే వ్యవస్థలు జాగ్రత్తగా ఉంటాయి. ఎవరూ ప్రశ్నించని సమాజంలో తప్పులు పెరుగుతాయి. ప్రశ్నించే సమాజంలో మార్పుకు అవకాశం ఉంటుంది. అందుకే జెన్ జీ గడుసుతనాన్ని పూర్తిగా అణచివేయడం కాదు.. దానికి సరైన దిశ చూపించడం సమాజం ముందున్న అసలు బాధ్యత. 'గడుసు పోరడు' అనిపించుకున్న యువకుడు కుటుంబానికి కాస్త తలనొప్పి కావచ్చు. కానీ అదే పోరడు ఒక రోజు ఇంటి పరిస్థితిని మార్చవచ్చు. ఒక పొలం నుంచి మరొక రంగానికి వెళ్లవచ్చు. ఒక చిన్న ఆలోచనతో వ్యాపారం ప్రారంభించవచ్చు. తన ఊరి పేరును ప్రపంచానికి పరిచయం చేయవచ్చు. అందుకే గడుసుతనాన్ని కేవలం గుణదోషంగా చూడకూడదు. దాని వెనుక ఉన్న శక్తిని గుర్తించాలి. ఉడుకు రక్తానికి జ్ఞానం జోడిస్తే అది నాయకత్వం అవుతుంది. మొండితనానికి లక్ష్యం జోడిస్తే అది పట్టుదల అవుతుంది. ప్రశ్నించే స్వభావానికి బాధ్యత జోడిస్తే అది ప్రజాస్వామ్య శక్తి అవుతుంది. రిస్క్ తీసుకునే ధైర్యానికి వివేకం జోడిస్తే అది ఆవిష్కరణ అవుతుంది. 'నో' చెప్పే స్వేచ్ఛకు విలువలు జోడిస్తే అది వ్యక్తిత్వం అవుతుంది. అదే జెన్ జీ అసలు బలం. వాళ్లు పూర్తిగా సరైనవాళ్లు కాదు. మనం కూడా కాదు. ప్రతి తరం తన కాలపు సమస్యలతో, తన కాలపు అవకాశాలతో తయారవుతుంది.



### జెన్ జీని మార్చాల్సిన అవసరం లేదు.

వారిని అర్థం చేసుకోవాలి... వారి కోపాన్ని వినాలి.
వారి ప్రశ్నలకు సమాధానం చెప్పాలి... వారి ధైర్యానికి దిశ చూపాలి.
వారి స్వేచ్ఛకు బాధ్యత నేర్పాలి... వారి కలలకు అవకాశాలు కల్పించాలి.
వాళ్లది మొండితనం కాదు.. మార్పు కోసం పట్టుదల.
అహంకారం కాదు.. తన ఉనికిపై నమ్మకం.
నిర్లక్ష్యం కాదు.. పాత గోడలను దాటి వెళ్లాలనే తపన.
భవిష్యత్తుపై భయం లేకపోవడం కాదు.. భవిష్యత్తును తామే నిర్మించగలమనే ధైర్యం.
ప్రపంచాన్ని వణికిస్తున్న యువతను చూసి భయపడాల్సిన అవసరం లేదు.
వారిని చూసి ఒక విషయం మాత్రం గుర్తించాలి. కాలం మారుతోంది.
నిన్నటి తరం 'మాకు దొరికిన ప్రపంచంలో బతికాం' అని చెప్పొచ్చు.
**కానీ ఈ తరం మాత్రం..**
'మాకు దొరికిన ప్రపంచాన్ని మేమే మార్చుకుంటాం' అని చెబుతోంది.
అందుకే జెన్ జీని తక్కువగా అంచనా వేయడం సమాజం చేసే పెద్ద పొరపాటు.
వాళ్లు గడుసు పోరాళ్లే కావచ్చు...
కానీ ఆ గడుసుతనంలోనే రేపటి ప్రపంచాన్ని మార్చే అగ్గి దాగి ఉండొచ్చు.

## లవ్లీ చిత్రం



వాణి కపూర్

## భర్త చనిపోతే గాజులు ఎందుకు తీసేయాలి



సినీనటి, యాంకర్ అనసూయ భరద్వాజ్ మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారారు. నెట్టింట తనపై వచ్చే విమర్శలు, ట్రోలింగ్‌కు తరచూ దీటుగా స్పందించే అనసూయ.. తాజాగా భారతీయ సంప్రదాయాలు, మహిళల అలంకరణలు, వితంతువులు పాటించే ఆచారాలపై చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు తీవ్ర చర్చకు దారితీశాయి. తన తల్లి వ్యక్తిగత జీవితాన్ని ఉదాహరణగా చెబుతూ అనసూయ పంచుకున్న భావోద్వేగ వీడియో ఒకవైపు పలువురిని ఆలోచింపజేస్తుండగా.. మరోవైపు ఆమె వ్యాఖ్యలపై విమర్శలు, ట్రోలింగ్ కూడా కొనసాగుతున్నాయి. ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన వీడియోలో అనసూయ తన తల్లి గురించి భావోద్వేగంగా మాట్లాడారు. గతంలో తన తల్లి కళ్లకు కాటుక పెట్టుకుని, నుదుట బొట్టు ధరించి, తలలో పూలు పెట్టుకుని ఎంతో నిండుగా, అందంగా కనిపించేదని గుర్తుచేసుకున్నారు. అయితే మూడేళ్ల క్రితం తన తండ్రి మరణించిన తర్వాత తల్లి ఈ అలంకరణలన్నింటికీ దూరమవడం తనను ఎంతగానో బాధించిందని చెప్పారు. చిన్నప్పటి నుంచి అమ్మ, అమ్మమ్మలు ఆడ పిల్లలకు గాజులు, గజ్జెలు, కాటుక, గోరింటాకు వంటి అలంకరణలను పరిచయం చేస్తారని అనసూయ అన్నారు. అలాంటి అలంకరణలను ఒక మహిళ వ్యక్తిత్వం, ఇష్టం కంటే ఆమె వైవాహిక జీవితంతో ఎందుకు ముడిపెడతారని ప్రశ్నించారు. మహిళలు ఇష్టపడే కట్టు, బొట్టు, గాజులు, పూలు వంటి అలంకరణలను భర్త జీవించి ఉన్నాడా లేదా అనే అంశంతో ఎందుకు అనుసంధానిస్తారని అనసూయ తన వీడియోలో ప్రశ్నించారు.




## 28 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో
# ఆలియా 'ఆల్ఫా'

ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీలో సూపర్ ఫ్యాన్ ఫాలోయింగ్ ఉన్న భామల్లో టాప్‌లో ఉంటుంది అలియా భట్. ఈ భామ నటించిన తొలి ఫీ మేల్ ఓరియెంటెడ్ స్పై యాక్షన్ థ్రిల్లర్ అల్ఫా (గూఢచారి). యశ్ రాజ్ ఫిలింస్ స్పై యూనివర్స్‌లో తెరకెక్కిన ఈ చిత్రాన్ని శివ్ రావైల్ డైరెక్ట్ చేశాడు. యశ్ రాజ్ ఫిలింస్ లాంటి అగ్ర నిర్మాణ సంస్థలో వచ్చినప్పటికీ బాక్సాఫీస్ వద్ద మూవీ లవర్స్‌ను నిరాశపరిచింది. కాగా ఇక ఓటీటీలో తన లక్‌ను పరీక్షించుకునేందుకు రెడీ అయింది. అల్ఫా ఆగస్టు 28 నుంచి పాపులర్ ఓటీటీ ప్లాట్ ఫాం నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది. ప్రస్తుతానికి ఒరిజినల్ హిందీ వెర్షన్ స్ట్రీమింగ్ కానున్నట్టు తెలుస్తుండగా.. డబ్‌డ్ వెర్షన్లకు సంబంధించిన అప్‌డేట్ రావాల్సి ఉంది. శార్వరి మరో లీడ్ రోల్‌లో నటించిన ఈ మూవీలో అనే కామియో రోల్‌లో హృతిక్ రోషన్ కబీర్ నటించాడు. బాబీ డియోలక్ష, అనిల్ కపూర్ ఇతక కీలక పాత్రలు పోషించారు. భారీ అంచనాల మధ్య విడుదలై బాక్సాఫీస్ వద్ద ఢీలా పడిపోయిన అల్ఫా మరి ఓటీటీలో ఎలాంటి స్పందన రాబట్టుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది.

## 'జాంబీ రెడ్డి 2'తో వస్తున్న తేజా సజ్జా

యువ హీరో తేజ సజ్జా పుట్టినరోజు సందర్భంగా టాలీవుడ్ మోస్ట్ క్రేజీ సీక్వెల్ 'జాంబీ రెడ్డి 2: నెక్ట్స్ లెవెల్' టైటిల్ అనౌన్స్మెంట్ వీడియో విడుదలైంది. మొదటి సినిమాతో తెలుగు తెరపై జాంబీ జోనర్‌ను పరిచయం చేసిన ప్రశాంత్ వర్మ, ఇప్పుడు ఈ సీక్వెల్‌ను మరింత పెద్ద స్థాయిలో తీసుకువస్తున్నారు. కేవలం తెలుగుకే పరిమితం కాకుండా, ఈసారి పాన్ ఇండియా స్థాయిలో భారీ మల్టీలింగ్వల్ ప్రాజెక్ట్‌గా 2027లో ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై నిర్మాతలు టి.జి. విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. మొదటి భాగానికి దర్శకత్వం వహించిన ప్రశాంత్ వర్మ ఈసారి కథను అందిస్తుండగా, 'ది ఫ్యామిలీ మ్యాన్', 'రాణా నాయుడు' వంటి వెబ్ సిరీస్‌లతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న సుపర్ణ్ వర్మ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో తేజా సజ్జాతో పాటు కన్నడ స్టార్ ఉపేంద్ర ఒక కీలక పాత్రలో నటిస్తున్నారు. అలాగే బాలీవుడ్ బ్యూటీ షనయా కపూర్ ఈ సినిమా ద్వారా టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇస్తుండటం విశేషం. ఈ సినిమా "బిగ్గర్, బ్యాడర్ అండ్ బ్లడీర్"గా ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు.






## పనే నా అదృష్టం

ప్రముఖ నటి రాశీ ఖన్నా భారత చిత్ర పరిశ్రమలో తన 13 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణాన్ని పూర్తి చేసుకున్నారు. 2013లో 'మద్రాస్ కేఫ్' చిత్రంతో నటిగా అరంగేట్రం చేసిన ఆమె, అప్పటి నుంచి సమయం చాలా వేగంగా గడిచిపోయిందని అన్నారు. పనిని ఎల్లప్పుడూ ఒక అదృష్టంగా భావించడం వల్లే తనకు అలా అనిపించిందని పేర్కొన్నారు. ఇటీవల '120 బహదూర్' చిత్రంలో ప్రత్యేక పాత్రలో కనిపించిన రాశీ, తన కెరీర్‌ను గుర్తుచేసుకుంటూ ఆనందం వ్యక్తం చేశారు. ఈ ప్రయాణం గురించి రాశీ ఖన్నా మాట్లాడుతూ, "పదమూడేళ్లు సుదీర్ఘ సమయం. కానీ, పనిని ఎప్పుడూ ఒక అదృష్టంగానే భావించాను కాబట్టి సమయం తెలియలేదు. 'మద్రాస్ కేఫ్' రోజుల్ని గుర్తుచేసుకుంటే, నా ప్రయాణం ఎందుకు మొదలైందో తెలుస్తుంది. నేను చెప్పాలనుకున్న కథలకు ఆ సినిమా అవకాశం ఇచ్చింది. ఈ ప్రయాణంలో నాకు మద్దతుగా నిలిచిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు" అని తెలిపారు. 'మద్రాస్ కేఫ్' తర్వాత ఆమె కెరీర్ వేగం పుంజుకుంది.

## తాప్సీ తల్లిదండ్రులు సస్తీ కాపీ

తాప్సీ చేసిన వ్యాఖ్యలు తన పెంపకాన్ని, తల్లిదండ్రులను కించపరిచేలా ఉన్నాయని ఆరోపిస్తూ కంగనా ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఘాటుగా స్పందించారు. తన తల్లిదండ్రులు ఒరిజినల్ వ్యక్తికి జన్మనిస్తే, ఆమె తల్లిదండ్రులు మాత్రం ఒక 'సస్తీ కాపీ' (చౌకైన నకలు) ని ఎందుకు కనాల్సి వచ్చిందంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తాప్సీ మాట్లాడుతూ, కంగనా రనౌత్‌ను తాను ఎప్పుడూ కలలో కూడా కలవలేదని, తమ మధ్య ఉన్న అభిప్రాయ భేదాలు తమ పెంపకం, ఆలోచనా విధానాన్ని బట్టే ఉంటాయని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపైనే కంగనా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తాప్సీ తన కొత్త సినిమా ప్రమోషన్లలో భాగంగా కేవలం తన పేరును మాత్రమే హైలైట్ చేసుకుంటున్నారని విమర్శించారు. కాగా, 2019లో 'జడ్జిమెంటల్ హై క్యా' సినిమా సమయంలో కంగనా సోదరి రంగోలీ చందేల్.. తాప్సీని 'సస్తీ కాపీ' అంటూ విమర్శించడంతో వీరిద్దరి మధ్య వివాదం ప్రారంభమైంది.



## 'దృశ్యం 4' రాబోతోంది

భారతీయ సినీ చరిత్రలో కల్ట్ క్లాసిక్ థ్రిల్లర్‌గా నిలిచిన 'దృశ్యం' ఫ్రాంచైజీ అభిమానులకు ఓ అదిరిపోయే శుభవార్త. ఈ ఉత్కంఠభరిత కథను కొనసాగిస్తూ 'దృశ్యం 4' రాబోతోందని చిత్ర నిర్మాత ఆంటోనీ పెరుంబావూర్ అధికారికంగా ప్రకటించారు. దీంతో జార్జ్‌కుట్టి అనే ఐకానిక్ పాత్రలో మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్ మరోసారి ప్రేక్షకులను అలరించడం ఖాయమైంది. 'దృశ్యం', 'దృశ్యం 2' చిత్రాలు బాక్సాఫీస్ వద్ద భారీ విజయాలు సాధించడమే కాకుండా, విమర్శకుల ప్రశంసలు అందుకున్నాయి. ఈ చిత్రాల స్ఫూర్తితోనే కథను మరో మెట్టు పైకి తీసుకెళ్లేందుకు చిత్రబృందం సిద్ధమైంది. ఈ ఫ్రాంచైజీ సృష్టికర్త, టాలెంటెడ్ డైరెక్టర్ జీతూ జోసెఫ్ ఈ నాలుగో భాగానికి కూడా దర్శకత్వం వహించనుండటంతో అంచనాలు రెట్టింపయ్యాయి.






## పెంపకాన్ని బట్టే మాటలు

బాలీవుడ్‌లో వివాదాస్పద వ్యాఖ్యలతో తరచూ వార్తల్లో నిలిచే నటీమణుల్లో కంగనా రనౌత్, తాప్సీ పన్ను ముందువరుసలో ఉంటారు. కొన్నేళ్ల క్రితం వీరిద్దరి మధ్య సోషల్ మీడియా వేదికగా జరిగిన మాటల యుద్ధం బాలీవుడ్‌లో తీవ్ర చర్చకు దారితీసింది. అయితే తాజాగా ఈ వివాదంపై తాప్సీ పన్ను మరోసారి స్పందించింది. కంగనాతో తనకు ఇప్పటివరకు నేరుగా పరిచయం కూడా లేదని చెబుతూనే.. వ్యక్తుల వ్యాఖ్యలు వారి పెంపకం, ప్రపంచాన్ని చూసే విధానాన్ని ప్రతిబింబిస్తాయని వ్యాఖ్యానించింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న తాప్సీని కంగనా రనౌత్‌తో ఉన్న విభేదాల గురించి ప్రశ్నించారు. దీనికి ఆమె స్పందిస్తూ.. కంగనాను ఇప్పటివరకు తాను నేరుగా కలవలేదని తెలిపింది. వివాదాలు మొదలయ్యే ముందు కూడా, ఆ తర్వాత కూడా ఆమెను వ్యక్తిగతంగా కలిసిన సందర్భం లేదని తాప్సీ స్పష్టం చేసింది. అయితే ఇద్దరి మధ్య గతంలో చోటుచేసుకున్న సోషల్ మీడియా వివాదాలపై తన అభిప్రాయాన్ని మాత్రం వెల్లడించింది. కంగనాతో జరిగిన వివాదాల గురించి మాట్లాడుతూ తాప్సీ కీలక వ్యాఖ్యలు చేసింది. ఒక వ్యక్తి మరొకరి గురించి ఎలా మాట్లాడుతున్నారనే విషయం వారి కుటుంబ నేపథ్యం, పెంపకం, ప్రపంచాన్ని చూసే విధానం గురించి తెలియజేస్తుందని ఆమె అభిప్రాయపడింది. ఒకరి వ్యాఖ్యలను బట్టి వారు ఎలాంటి వాతావరణంలో పెరిగారో అర్థం చేసుకోవచ్చని పేర్కొంది.



# కర్ణ్ శర్మ రిటైర్మెంట్

భారత సీనియర్ లెగ్ స్పిన్నర్ కర్ణ్ శర్మ అంతర్జాతీయ, భారత దేశవాళీ క్రికెట్‌లో అన్ని ఫార్మాట్ల క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. 38 ఏళ్ల కర్ణ్ శర్మ భారత్ తరఫున ఒక టెస్టు మ్యాచ్, రెండు వన్డేలు, ఒక టీ20 ఆడాడు. ప్రస్తుతం యూపీ టీ20 లీగ్‌లో కాన్పూర్ సూపర్‌స్టార్స్‌కు ఆడుతున్న ఇతను.. ఆగస్టు 25న మీరట్ మావెరిక్స్‌తో ఆడే మ్యాచ్ తనకు చివరిదని పేర్కొన్నాడు. రిటైర్మెంట్ తర్వాత కోచింగ్, క్రికెట్‌కు సంబంధించిన ఇతర బాధ్యతలు చేపట్టడానికి అందుబాటులో ఉంటానన్నాడు. ఇన్నాళ్లు తనకు మద్దతుగా నిలిచిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపాడు. కర్ణ్ శర్మకు అంతర్జాతీయ కెరీర్‌లో పెద్దగా అవకాశాలు రాకపోయినప్పటికీ ఐపీఎల్‌లో మంచి బౌలర్‌గా గుర్తింపు తెచ్చుకున్నాడు. ఈ టోర్నీలో 90 మ్యాచ్‌లు ఆడి 83 వికెట్లు పడగొట్టాడు. అంతేకాదు మూడు వేర్వేరు జట్లతో వరుసగా మూడు ఐపీఎల్ టైటిళ్లను గెల్చుకున్న తొలి ఆటగాడిగా నిలిచాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్ (2016), ముంబయి ఇండియన్స్ (2017), చెన్నై సూపర్ కింగ్స్ (2018) తరఫున ఐపీఎల్ టైటిళ్లను ముద్దాడాడు.





# పడిక్కల్ మరో సెంచరీ

రెండో టెస్టు తొలిరోజు భారత్ 300-5

## రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగిన రిషబ్ పంత్.. మూడు వికెట్లతో రాణించిన ఫెర్నాండో

శ్రీలంకతో జరుగుతున్న రెండో టెస్టులో యువ బ్యాటర్ దేవదత్ పడిక్కల్ (117) వరుసగా రెండో శతకంతో కదం తొక్కాడు. దీంతో సింహళీస్ స్పోర్ట్స్ క్లబ్ (రాజ) మైదానంలో ఆదివారం ప్రారంభమైన మ్యాచ్‌లో తొలి రోజు ఆట ముగిసే సమయానికి భారత్ 5 వికెట్ల నష్టానికి 300 పరుగులు చేసింది. పడిక్కల్ సెంచరీతో భారత్ భారీ స్కోరుపై కన్నేసినప్పటికీ, రెండో కొత్త బంతితో శ్రీలంక బౌలర్లు విజృంభించి కళ్లెం వేశారు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్‌కు శుభారంభం దక్కలేదు. ఓపెనర్లు యశస్వి జైస్వాల్ 45, కేఎల్ రాహుల్ 18 పరుగులు చేశారు. అయితే, శుభ్‌మన్ గిల్ (50) అర్ధశతకంతో ఆదుకున్నాడు. ముఖ్యంగా పడిక్కల్ అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. కట్ షాట్లతో లంక బౌలర్లపై ఆధిపత్యం చెలాయించాడు. ఆఖరి సెషన్‌లో రవీంద్ర జడేజా (43)తో కలిసి 74 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. సెంచరీ పూర్తి చేశాక పడిక్కల్ మరింత వేగంగా ఆడాడు. అయితే, ఆఖరి సెషన్‌లో భారత్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. లహిరు కుమార వేసిన పదునైన బౌన్సర్ ఎడమ చేతి మణికట్టుకు బలంగా తగలడంతో వికెట్ కీపర్ రిషబ్ పంత్ రిటైర్డ్ హర్ట్‌గా మైదానాన్ని వీడాడు. అతని గాయం తీవ్రతపై స్పష్టత రావాల్సి ఉంది. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన జడేజా దూకుడుగా ఆడాడు. మరోవైపు, అద్భుతంగా ఆడుతున్న పడిక్కల్‌ను స్పిన్నర్ కేశర నువంత ఔట్ చేశాడు. రెండో కొత్త బంతిని అందుకున్న ఆసిత ఫెర్నాండో, అద్భుతమైన ఇన్‌స్వింగర్‌తో జడేజాను క్లీన్ బౌల్డ్ చేశాడు. దీంతో శ్రీలంక శిబిరంలో ఆనందం వెల్లివిరిసింది.



తొలి రోజు ఆట ముగిసే సమయానికి ధ్రువ్ జురెల్ (7), అరంగేట్ర ఆటగాడు సారాంశ్ జైన్ (4) క్రీజులో ఉన్నారు. లంక బౌలర్లలో ఆసిత ఫెర్నాండో 3 వికెట్లతో రాణించగా, లహిరు కుమార ఒక వికెట్ పడగొట్టాడు. మొత్తంగా తొలి రోజు ఆట ఇరు జట్లకు సమంగా ముగిసింది.

**సంక్షిప్త స్కోర్లు:**

భారత్ తొలి ఇన్నింగ్స్: 85 ఓవర్లలో 300/5 (దేవదత్ పడిక్కల్ 117, శుభ్‌మన్ గిల్ 50; ఆసిత ఫెర్నాండో 3–46, లహిరు కుమార 1–38)



# ఫెర్నాండో వర్సెస్ జైస్వాల్

కొలంబో వేదికగా భారత్, శ్రీలంక జట్ల మధ్య జరుగుతున్న సిరీస్‌లోని చివరి టెస్టు మ్యాచ్‌లో ఉద్రిక్తత చోటుచేసుకుంది. టీమిండియా యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్, లంక పేసర్ అసిత ఫెర్నాండో మధ్య మైదానంలో తీవ్ర వాగ్వాదం జరిగింది. ఆదివారం మ్యాచ్ తొలి రోజు లంచ్ విరామానికి కొద్దిసేపటి ముందు ఈ ఘటన చోటుచేసుకుంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్ ఇన్నింగ్స్ 17వ ఓవర్ చివరి బంతికి, ఫెర్నాండో అద్భుతమైన డెలివరీతో జైస్వాల్‌ను బౌల్డ్ చేశాడు. అయితే, వికెట్ పడిన వెంటనే మైదానంలో అనూహ్య పరిణామాలు చోటుచేసుకున్నాయి. శ్రీలంక ఆటగాళ్లు సంబరాలు చేసుకుంటుండగా, యశస్వి డగౌట్ వైపు వెళుతున్న క్రమంలో అసిత ఫెర్నాండో కొన్ని వ్యాఖ్యలు చేశాడు. దీంతో జైస్వాల్ ఒక్కసారిగా వెనక్కి తిరిగి అతడిని నిలదీశాడు. ఆగ్రహానికి గురైన జైస్వాల్, బౌలర్ ఫెర్నాండో వైపు దూసుకెళ్లి వాగ్వాదానికి దిగాడు. ఇద్దరి మధ్య మాటల యుద్ధం ముదరడం, ఒకరికొకరు అత్యంత సమీపంలోకి రావడంతో మైదానంలో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈ గొడవకు ముందు, ఫెర్నాండో బౌలింగ్‌లోనే జైస్వాల్ వరుసగా మూడు బంతుల్లో మూడు బౌండరీలు బాదాడు. ఆ తర్వాత బంతికే యశస్వి అవుట్ కావడంతో ఫెర్నాండో దూకుడుగా సంబరాలు చేసుకోవడం, లంక ఆటగాళ్ల వ్యాఖ్యలు జైస్వాల్ ప్రతిస్పందనకు కారణమయ్యాయి. ఈ ఇన్నింగ్స్‌లో యశస్వి జైస్వాల్ 53 బంతులు ఎదుర్కొని 9 ఫోర్ల సాయంతో 45 పరుగులు చేసి వెనుదిరిగాడు.

# బంగ్లాదేశ్.. నం.6

## ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్‌లో తొలిసారి ఉత్తమ ర్యాంక్

బంగ్లాదేశ్ క్రికెట్ జట్టు టెస్ట్ ఫార్మాట్‌లో సరికొత్త చరిత్రను లిఖించింది. ఐసీసీ ఆదివారం విడుదల చేసిన తాజా టెస్ట్ ర్యాంకింగ్స్‌లో మూడు స్థానాలు ఎగబాకి ఆరో ర్యాంకును కైవసం చేసుకుంది. టెస్ట్ క్రికెట్ చరిత్రలో బంగ్లాదేశ్ జట్టు తొమ్మిదో స్థానాన్ని దాటి పైకి రావడం ఇదే ప్రప్రథమం కావడం విశేషం. ఇటీవల ఆస్ట్రేలియా పర్యటనలో చారిత్రక ప్రదర్శన కనబరచడమే ఈ ఘనతకు కారణమైంది. ఇటీవల ఆస్ట్రేలియా గడ్డపై జరిగిన రెండు టెస్టుల సిరీస్‌ను బంగ్లాదేశ్ 1–1తో సమం చేసింది. తొలి టెస్టులో అద్భుత విజయం సాధించి, రెండో టెస్టులో ఓటమిపాలైంది. ఈ ప్రదర్శనతో 78 రేటింగ్ పాయింట్లతో ఆరో స్థానానికి చేరుకుంది. ఈ క్రమంలో వెస్టిండీస్, పాకిస్థాన్, శ్రీలంక వంటి బలమైన జట్లను వెనక్కి నెట్టింది. ఈ ఘనతపై బంగ్లాదేశ్ టెస్ట్ కెప్టెన్ నజ్ముల్ హోస్సేన్ శాంటో ఆనందం వ్యక్తం చేశాడు. "టెస్టుల్లో ఆరో ర్యాంకుకు చేరుకోవడం కచ్చితంగా శుభవార్తే. ఇది మాకు అతిపెద్ద విజయం" అని వ్యాఖ్యానించాడు. అయితే, రెండో టెస్టులో ఓటమి నేపథ్యంలో, మరింత మెరుగ్గా ఆడి ఉంటే బాగుండేదని అభిప్రాయపడ్డాడు.






# బంగ్లా చిత్తు

## రెండో రోజే సమర్పణ.. రెండో టెస్టులో ఆసీస్ విన్

బంగ్లాదేశ్‌తో జరిగిన రెండో టెస్టులో ఆస్ట్రేలియా ఘనవిజయం సాధించింది. కేవలం రెండు రోజుల్లోనే ముగిసిన ఈ మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌ను ఇన్నింగ్స్, 51 పరుగుల తేడాతో చిత్తు చేసింది. ఈ గెలుపుతో రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌ను ఆస్ట్రేలియా 1–1తో సమం చేసింది. స్వదేశంలో జరిగిన తొలి టెస్టులో ఎదురైన అనూహ్య ఓటమికి ఈ విజయంతో ఆసీస్ ప్రతీకారం తీర్చుకుంది. ఈ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా పేస్ బౌలర్లు నిప్పులు చెరిగారు. ముఖ్యంగా మిచెల్ స్టార్క్ (10 వికెట్లు), ప్యాట్ కమిన్స్ (6 వికెట్లు) ధాటికి బంగ్లా బ్యాటర్లు నిలవలేకపోయారు. ఆసీస్ పేసర్ల ఉధృతికి బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 64 పరుగులకే కుప్పకూలగా, రెండో ఇన్నింగ్స్‌లో 95 పరుగులకే ఆలౌట్ అయింది. అంతకుముందు, తొలి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా 210 పరుగులు చేసింది. రెండో రోజు 165/8 ఓవర్‌నైట్ స్కోరుతో బ్యాటింగ్ కొనసాగించిన ఆసీస్‌ను కామెరూన్ గ్రీన్ (67), నాథన్ లయన్ (32 నాటౌట్) ఆదుకున్నారు. వీరి కీలక భాగస్వామ్యం ఆసీస్‌కు విలువైన ఆధిక్యాన్ని అందించింది. బంగ్లాదేశ్ బౌలర్లలో షోరిఫుల్ ఇస్లాం ఒక్కడే 7 వికెట్లు పడగొట్టి అద్భుత ప్రదర్శన కనబరిచాడు. పేస్‌కు అనుకూలించిన పిచ్‌పై ఆస్ట్రేలియా బౌలర్ల పూర్తి ఆధిపత్యం ప్రదర్శించడంతో, ఈ మ్యాచ్ రెండో రోజు రెండో సెషన్‌లోనే ముగిసింది.

ఈవార్తలు
# ప్రజావాణి
సోమవారం 24-8-2026, జగిత్యాల
www.evarthalu.com
నేటి ఈవార్తలు


నేటి ఈవార్తలు సంపాదకీయం Editorial

# రాహుల్.. భస్మాసుర 'హస్తం'!

"వందే మాతరం" కేవలం ఒక పాట కాదు. అది భారత స్వాతంత్ర్యోద్యమానికి ఊపిరి పోసిన నినాదం. దేశభక్తికి ప్రతీక. స్వదేశీ చైతన్యానికి సంకేతం. లక్షలాది భారతీయులను బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ఏకం చేసిన భావోద్వేగం. అలాంటి జాతీయ గీతంపై కాంగ్రెస్ తాజాగా తీసుకున్న వైఖరి మరోసారి రాజకీయ చర్చకు దారితీసింది. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ పార్టీ కార్యక్రమాల్లో "వందే మాతరం"లో మొదటి రెండు చరణాలనే ఆలపించాలని నిర్ణయించుకుంది. ఈ నిర్ణయం పార్టీ పాత 1937 తీర్మానాన్ని ఆధారంగా చేసుకున్నదే అయినప్పటికీ, నేటి రాజకీయ, సామాజిక వాతావరణంలో దీని ప్రభావం మాత్రం పూర్తిగా భిన్నంగా కనిపిస్తోంది. ఇక్కడ అసలు ప్రశ్న కాంగ్రెస్‌కు "వందే మాతరం"పై గౌరవం ఉందా లేదా అన్నది మాత్రమే కాదు. దేశంలోని మెజారిటీ ప్రజల సాంస్కృతిక భావోద్వేగాలను కాంగ్రెస్ ఇప్పటికీ సరిగా అర్థం చేసుకుంటోందా? అన్నదే. అయోధ్య ఉద్యమ సమయంలో కాంగ్రెస్ చేసిన రాజకీయ తప్పిదం ఏమిటో భారత రాజకీయ చరిత్ర చెబుతోంది. హిందూ సమాజంలో దశాబ్దాలుగా పేరుకుపోయిన భావోద్వేగాన్ని కాంగ్రెస్ సరైన రీతిలో అర్థం చేసుకోలేకపోయింది. ఆ అంశాన్ని కేవలం రాజకీయ సమస్యగా చూసింది. కానీ సామాన్య హిందువు దృష్టిలో అది విశ్వాసం, సంస్కృతి, ఆత్మగౌరవంతో ముడిపడిన విషయం. ఆ అంతరాన్ని గుర్తించడంలో కాంగ్రెస్ విఫలమైంది. చివరికి ఆ రాజకీయ శూన్యతను ఇతర పార్టీలు పూరించాయి. ఇప్పుడు "వందే మాతరం" వివాదం కూడా కాంగ్రెస్‌కు మరో రాజకీయ పరీక్షగా మారుతోంది. 1937లో కాంగ్రెస్ తీసుకున్న నిర్ణయానికి ఆ కాలపు రాజకీయ, సామాజిక నేపథ్యం ఉంది. "వందే మాతరం"లోని మొదటి రెండు చరణాల్లో మాతృభూమి అందాలు, ప్రకృతి వైభవం ప్రధానంగా ఉంటే, తర్వాతి చరణాల్లో హిందూ దేవతలకు సంబంధించిన ప్రతీకలు ఉన్నాయనే కారణంతో అప్పట్లో వివాదం ఏర్పడింది. అందుకే మొదటి రెండు చరణాలనే బహిరంగంగా ఆలపించాలనే నిర్ణయం తీసుకున్నారు. ఆ చారిత్రక నేపథ్యాన్ని విస్మరించలేం. కానీ తొమ్మిది దశాబ్దాల క్రితం ఉన్న సామాజిక, రాజకీయ పరిస్థితులనే యథాతథంగా నేటికీ వర్తింపజేయడం రాజకీయ పరిణతి అనిపించుకోదు. దేశం మారింది. సమాజం మారింది. రాజకీయ అవగాహన మారింది. సాంస్కృతిక గుర్తింపుపై ప్రజల్లో చైతన్యం పెరిగింది. ప్రజల భావోద్వేగాలు మారినప్పుడు రాజకీయ పార్టీలు కూడా తమ ఆలోచనలను పునఃపరిశీలించుకోవాలి. కాంగ్రెస్ మాత్రం ఒక విచిత్రమైన స్థితిలో కనిపిస్తోంది. తన నిర్ణయాన్ని సమర్థించుకోవడానికి చరిత్రను ముందుకు తెస్తోంది. కానీ ఆ నిర్ణయం నేటి సమాజంలో ఎలాంటి సందేశాన్ని ఇస్తుందో మాత్రం సమగ్రంగా ఆలోచించినట్లు కనిపించడం లేదు. ఇక్కడ ఒక ప్రమాదకరమైన రాజకీయ ధోరణి కనిపిస్తోంది. హిందూ సంస్కృతి, హిందూ సంప్రదాయం, భారతీయ ఆధ్యాత్మిక చిహ్నాల పట్ల గౌరవం వ్యక్తం చేసిన వెంటనే దాన్ని "మెజారిటీవాదం" లేదా "మత రాజకీయాలు"గా చిత్రీకరించడం సరైన పద్ధతి కాదు. భారతీయ నాగరికతలో పుట్టిన సాంస్కృతిక చిహ్నాలను గౌరవించడం మత విద్వేషం కాదు. అదే సమయంలో ఇతర మతాలను గౌరవించడం కూడా లౌకికవాదానికి ప్రాణం. లౌకికవాదం అంటే హిందూ భావోద్వేగాలను పక్కన పెట్టడం కాదు. సర్వమత సమభావం అంటే మెజారిటీ విశ్వాసాన్ని అనుమానించడం కాదు. కాంగ్రెస్ ఈ సున్నితమైన వ్యత్యాసాన్ని అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉంది. "వందే మాతరం"ను హిందూ-ముస్లిం కోణంలోనే చూడటం కూడా భారతీయతను పరిమితం చేయడమే. దేశాన్ని తల్లిగా భావించడం ఒక మతానికి చెందిన ఆలోచన కాదు. అది భారత స్వాతంత్ర్య పోరాటం నిర్మించిన జాతీయ భావోద్వేగం. ఈ నిర్ణయంపై కాంగ్రెస్‌లోనే అసౌకర్యం కనిపిస్తోందన్న వార్తలు రావడం గమనార్హం. పార్టీ నాయకత్వం ఈ అంశాన్ని మరింత సున్నితంగా, రాజకీయంగా తెలివిగా నిర్వహించాల్సిందని కొందరు భావిస్తున్నట్లు నివేదికలు చెబుతున్నాయి. అంటే ఇది కేవలం బయటివారి విమర్శ మాత్రమే కాదు; పార్టీ అంతర్గతంగా కూడా ఈ నిర్ణయం సరైనదా అనే ప్రశ్న తలెత్తుతోంది. రాజకీయ పార్టీకి ప్రత్యర్థుల విమర్శ కంటే ప్రమాదకరమైనది ప్రజల మౌనం. "వందే మాతరం" అంశంపై కొంతమంది హిందువుల్లో కాంగ్రెస్ పట్ల అసంతృప్తి, దూరం పెరుగుతున్నట్లు రాజకీయంగా కనిపిస్తే, దానిని తేలిగ్గా తీసుకోవడం కాంగ్రెస్‌కు మరో పెద్ద తప్పిదం కావచ్చు. ఎందుకంటే నేటి హిందూ సమాజం ఒకే రకమైన రాజకీయ ఆలోచనతో లేదు. అందరూ ఒకే పార్టీకి ఓటు వేయరు. అందరూ ఒకే సిద్ధాంతాన్ని నమ్మరు. కానీ తమ విశ్వాసం, సంస్కృతి, జాతీయ చిహ్నాలను అవమానిస్తున్నారనే భావన కలిగితే రాజకీయంగా స్పందించే సామర్థ్యం మాత్రం పెరిగింది. కాంగ్రెస్ ఈ వివాదాన్ని బీజేపీ సృష్టించిన రాజకీయ ఉచ్చుగా మాత్రమే కొట్టిపారేయవచ్చు. కానీ ప్రజల భావోద్వేగాన్ని ఎప్పటికీ ప్రత్యర్థి పార్టీ ప్రచారంగా మాత్రమే చూడలేం. ప్రత్యర్థి రాజకీయ లాభం పొందుతున్నాడని భావించి అసలు ప్రజా భావాన్ని నిర్లక్ష్యం చేస్తే రాజకీయ పార్టీలు గతంలో భారీ మూల్యం చెల్లించుకున్న ఉదాహరణలు ఉన్నాయి. అయోధ్య విషయంలో అదే జరిగింది. రాముడి పేరు కేవలం రాజకీయ నినాదం కాదని కాంగ్రెస్ ఆలస్యంగా గుర్తించింది. ఇప్పుడు వందే మాతరం కేవలం ఒక పాట కాదని కూడా గుర్తించాల్సిన సమయం వచ్చింది. దేశ ప్రజల్లో పెరుగుతున్న సాంస్కృతిక ఆత్మవిశ్వాసాన్ని అర్థం చేసుకోవాలి. హిందూ సంప్రదాయాలను గౌరవించడం అంటే మైనారిటీల హక్కులను తగ్గించడం కాదని గ్రహించాలి. మైనారిటీలను రక్షించడం కోసం మెజారిటీ భావోద్వేగాలను నిర్లక్ష్యం చేయాల్సిన అవసరం లేదని అంగీకరించాలి. భారతదేశం ఎవరిదైనా కాదు.. అందరిదీ. అలాగే భారతీయ సంస్కృతి కూడా ఎవరికీ వ్యతిరేకం కాదు. కాంగ్రెస్ తన చారిత్రక పాత్రను గొప్పగా చెప్పుకుంటుంది. స్వాతంత్ర్య ఉద్యమంలో తన పాత్రను గుర్తు చేస్తుంది. కానీ చరిత్రపై హక్కు చెప్పుకోవడం మాత్రమే రాజకీయ భవిష్యత్తుకు సరిపోదు. నేటి భారతదేశాన్ని అర్థం చేసుకోవడం కూడా అంతే అవసరం.

# గావురం.. బాల్యానికి గాయం!



పుస్తకం పట్టిన చేతికి..
కత్తి ఎందుకు వచ్చింది?
పాట పాడాల్సిన గొంతులో..
ప్రతీకారం ఎందుకు మొలిచింది?
కలలు కనే కళ్లలో.. కాసుల
కోసం రక్తపు నీడ ఎందుకు పడింది?
బాల్యం బాట తప్పితే.. బడి ఏం చేస్తోంది?
బడి మౌనమైతే.. తల్లిదండ్రులు
ఎక్కడున్నారు?
తల్లిదండ్రులు మౌనమైతే..
సమాజం ఎటు చూస్తోంది?
బాల్యం భ్రష్టుపడుతుంటే..
పాలకుల కళ్లు ఇంకా ఎందుకు
తెరుచుకోవడం లేదు?

నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లిలో ప్రిన్సిపాల్ రూపా రెడ్డి హత్య ఘటన ఒక వార్త కాదు. ఒక హెచ్చరిక. మనం పెంచుతున్న బాల్యం ఎటు వెళ్తుందో నిలదీసే ఒక విషాద ప్రశ్న. అక్షరం దిద్దాల్సిన చేతులు కత్తి పట్టాయి. గురువు వద్దే చదువుకున్న పదో తరగతి పిల్లలు ఆమెను హత్య చేశారు. తలచుకుంటేనే వెన్నులో వణుకు పుడుతోంది. ఇది ఒక్క హత్య కాదు. మనం పెంచుతున్న బాల్యం, మనం నడుపుతున్న పాఠశాల వ్యవస్థ, మనం నిర్మించుకున్న కుటుంబ వ్యవస్థ ఎక్కడో తడబడుతున్నాయన్న గట్టి సంకేతం. పోలీసుల కథనం ప్రకారం నిందితులు డబ్బు కోసం ఇంట్లోకి వెళ్లారు. గుర్తుపట్టడంతో దాడి చేశారు. ఐదు ప్రత్యేక బృందాలు, 70 సీసీ కెమెరాల పరిశీలన, నగదు, ఫోన్లు తదితర ఆధారాలతో కేసును ఛేదించారు. నేరాన్ని ఛేదించడం పోలీసుల పని. నేరం రుజువు చేయడం న్యాయస్థానం పని. కానీ పదహారేళ్ల పిల్లాడి మనసులో నేరం ఎందుకు పుట్టిందో వెతకడం మాత్రం మనందరి పని.

పదో తరగతి అంటే ఏమిటి? జీవితంలో తొలి మలుపు. కలలు కనే వయసు. డాక్టర్ అవుదామా? కలెక్టర్ అవుదామా? తల్లిదండ్రుల కష్టం తీర్చుదామా? అని ఆలోచించాల్సిన వయసు. అలాంటి వయసులో జల్సాలకు డబ్బు కావాలి అనే ఆలోచన ఎలా వచ్చింది? ఈ ప్రశ్నకు సమాధానం వెతికితే మనం ముందుగా మన ఇళ్ల తలుపు తట్టుకోవాలి. మనం పిల్లల మార్కులు అడుగుతాం. ర్యాంకులు అడుగుతాం. కానీ వారి స్నేహితుడు ఎవరో అడగం. ఫోన్‌లో ఏం చూస్తున్నారో తెలుసుకోం. తరచూ డబ్బు ఎందుకు అడుగుతున్నారో ఆరా తీయం. మాట తీరు ఎందుకు మారిందో, కోపం ఎందుకు పెరిగిందో, ఒంటరిగా ఎందుకు ఉంటున్నారో గమనించం. ఖరీదైన ఫోన్ కొనివ్వడం తండ్రి బాధ్యత అనుకుంటున్నాం. కానీ ఆ ఫోన్‌లో బిడ్డ ఏ ప్రపంచంలో విహరిస్తున్నాడో తెలుసుకోవడం మాత్రం మర్చిపోతున్నాం. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోనే ఈ ఏడాది 215 కేసుల్లో 275 మంది మైనర్లు అరెస్టయ్యారంటే పరిస్థితి తీవ్రత అర్థమవుతుంది. అందులో 60 శాతం మంది 16–18 ఏళ్ల మధ్య వయసువారే. అంటే నేరం బయటపడే వయసు 16 ఏళ్లయితే.. దాని బీజం అంతకుముందే పడుతున్నదా? అన్నది ఆలోచించాల్సిన ప్రశ్న. జాతీయ నేర గణాంక సంస్థ లెక్కల ప్రకారం తెలంగాణలో 2024లో మైనర్లు చేసిన నేరాలు 1,569గా నమోదయ్యాయి. లక్ష మంది పిల్లల జనాభాకు 13.8 నేరాలుగా నమోదైన పరిస్థితి ఆందోళన కలిగిస్తోంది. మత్తు పదార్థాల కేసుల్లో పట్టుబడిన మైనర్ల సంఖ్య 2023లో 37 నుంచి 2024లో 69కు పెరిగింది. పిల్లలపై జరుగుతున్న నేరాలు కూడా 6,113 నుంచి 6,767కు పెరిగాయి. ఇవి కేవలం సంఖ్యలు కావు. ఒక్కో సంఖ్య వెనుక ఒక బాల్యం ఉంది. ఒక కుటుంబం ఉంది. ఒక భవిష్యత్తు ఉంది.

ఈ విషాదానికి తొలి బాధ్యత తల్లిదండ్రులదే. ఇది కాదనలేని నిజం. బిడ్డకు డబ్బు ఇవ్వండి. కానీ ఆ డబ్బు విలువ నేర్పండి. ఫోన్ ఇవ్వండి. కానీ దాని హద్దు నేర్పండి. స్వేచ్ఛ ఇవ్వండి. కానీ బాధ్యత నేర్పండి. ప్రేమ ఇవ్వండి. కానీ క్రమశిక్షణను కూడా ఇవ్వండి. ఈ రోజు చాలా ఇళ్లలో తల్లిదండ్రులు పిల్లలకు ఏటీఎంలుగా మారుతున్నారు. అడిగినంత డబ్బు ఇవ్వడమే ప్రేమ అనుకుంటున్నారు. అది ప్రేమ కాదు.. తెలియకుండానే పెంచుతున్న ప్రమాదం. పిల్లవాడు డబ్బు ఎందుకు అడుగుతున్నాడు? ఎక్కడ ఖర్చు పెడుతున్నాడు? ఎవరితో తిరుగుతున్నాడు? ఏం చూస్తున్నాడు? ఏం ఆలోచిస్తున్నాడు? అనే ప్రశ్నలకు తల్లిదండ్రుల దగ్గర సమాధానం ఉండాలి. ఉద్యోగాలు, వ్యాపారాలు, జీవిత పరుగులో పిల్లల మనసు చదివే సమయం లేకుండా పోయింది. కానీ రోజుకు పది నిమిషాలు చాలు. "ఈ రోజు ఏం జరిగింది? నీ మనసులో ఏముంది?" అని పిల్లాడి పక్కన కూర్చుని అడగండి. ఆ ఒక్క ప్రశ్న ఒక నేరాన్ని ఆపవచ్చు. ఒక జీవితాన్ని కాపాడవచ్చు. రెండో బాధ్యత ఉపాధ్యాయులది. ఒకప్పుడు గురువు అంటే భయం మాత్రమే కాదు.. భక్తి కూడా ఉండేది. ఇప్పుడు కొన్ని చోట్ల విద్యార్థిని చూసి గురువే భయపడే పరిస్థితి కనిపిస్తోంది. వ్యక్తిగతంగా ఉపాధ్యాయులను తప్పుపట్టడం కాదు. మారిపోయిన విద్యా వ్యవస్థను ప్రశ్నించాలి. పాఠశాల మార్కుల ఫ్యాక్టరీగా మారకూడదు. ఎన్ని వందల మార్కులు వచ్చాయి? ఎంత ర్యాంకు వచ్చింది? అనేదే పిల్లవాడి విజయానికి కొలమానం కాకూడదు. మంచి మార్కులు తెచ్చే యంత్రాన్ని తయారు చేస్తున్నాం. కానీ మంచి మనిషిని తయారు చేయడం మర్చిపోతున్నామా? ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు పిల్లవాడి వ్యక్తిత్వం రూపుదిద్దుకునే అత్యంత కీలక దశ. ఈ ఐదేళ్లలో మెరిట్ మార్కుల కోసం ఎంత శ్రద్ధ పెడుతున్నామో, వ్యక్తిత్వ నిర్మాణం కోసం కూడా అంతే శ్రద్ధ పెట్టాలి. ఇది కేవలం విద్యాశాఖకు సంబంధించిన అంశం కాదు. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి విద్య, హోం, మహిళా--శిశు సంక్షేమ, వైద్య, న్యాయ శాఖల వరకు కలిసి ఆలోచించాల్సిన సమగ్ర బాల్య రక్షణ సమస్య. తెలంగాణ ప్రభుత్వం ఇక ఆలోచనల దగ్గర ఆగకుండా ఆచరణలోకి దిగాల్సిన సమయం వచ్చింది. ఐదో తరగతి వరకు ఆటపాటలతో నీతి కథలు చెప్పడం సరిపోవచ్చు. కానీ ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు ప్రత్యేకమైన 'జీవన విద్య' లేదా 'విలువల విద్య' అవసరం. అందులో నేరం అంటే ఏమిటి? చట్టం ఏం చెబుతుంది? కోపాన్ని, ఒత్తిడిని ఎలా నియంత్రించాలి? చెడు స్నేహానికి 'నో' ఎలా చెప్పాలి? మత్తు పదార్థాలు జీవితాన్ని ఎలా నాశనం చేస్తాయి? సామాజిక మాధ్యమాలను బాధ్యతగా ఎలా ఉపయోగించాలి? ఒక నేరం ఒక కుటుంబాన్ని ఎలా కూలదోస్తుంది? వంటి అంశాలు ఉండాలి.వారానికి కనీసం రెండు పీరియడ్లు కేటాయించాలి. పాఠం చెప్పేది కేవలం ఉపాధ్యాయుడు మాత్రమే కాకూడదు. శిక్షణ పొందిన కౌన్సెలర్, పోలీసు అధికారి, మానసిక ఆరోగ్య నిపుణుడు కూడా పిల్లలతో ముఖాముఖి మాట్లాడాలి. విద్యార్థి ప్రవర్తనలో తీవ్రమైన మార్పు కనిపిస్తే వెంటనే తల్లిదండ్రులు-ఉపాధ్యాయులు-కౌన్సెలర్ కలిసి చర్చించే వ్యవస్థ ప్రతి పాఠశాలలో ఉండాలి. మార్కులు తగ్గాయని పేరెంట్స్ మీటింగ్ పెట్టినట్లే.. ప్రవర్తన మారిందని కూడా తల్లిదండ్రులను పిలిచే వ్యవస్థ ఉండాలి. ఎందుకంటే మార్కులు తగ్గితే ఒక పరీక్ష పోతుంది. కానీ పిల్లవాడి మనసు తప్పుదోవ పట్టితే.. ఒక జీవితం పోవచ్చు. సెల్‌ఫోన్‌లో ప్రపంచం పిల్లల గదిలోకే వచ్చేసింది. బయటి ప్రపంచం చెడును చూపించేలోపే పాఠశాల మంచి మార్గాన్ని చూపాలి. చెడు గురించి చెప్పకపోతే పిల్లలకు తెలియదనుకోవడం మన భ్రమ. చెడు ఏమిటో మాత్రమే కాదు.. దాని పర్యవసానం ఏమిటో కూడా మనమే ముందుగా నేర్పాలి.

రూపారెడ్డి తిరిగిరారు. ఆ కుటుంబానికి జరిగిన నష్టాన్ని ఎవరూ పూడ్చలేరు. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆ పిల్లల భవిష్యత్తు కూడా ఇప్పుడు ప్రశ్నార్థకమే. అయితే ఈ విషాదం ఇక్కడితో ముగిసిపోవాలా? లేక మన పిల్లల భవిష్యత్తు కోసం ఒక కొత్త ఆలోచనకు నాంది కావాలా? బాలుడి చేతిలో కత్తి కనిపించిన తర్వాత పరుగెత్తే సమాజంగా కాదు.. అతని మనసులో కోపం మొలకెత్తినప్పుడే చేయి పట్టుకునే సమాజంగా మారాలి. పరీక్షల్లో మార్కులు ఇచ్చే విద్య మాత్రమే కాదు.. జీవితానికి దారి చూపే విద్య కావాలి. మెరిట్ కోసం పడే తపనలో సగమైనా మంచి నడవడిక కోసం పడితే.. రేపు మరో రూపా రెడ్డి బలి కాకపోవచ్చు.పిల్లల చేతుల్లో పుస్తకాలు ఉండాలి..కలలు ఉండాలి..కలలను నిజం చేసుకునే ధైర్యం ఉండాలి..

కత్తులు కాదు.

అదే రూపా రెడ్డి ఆత్మకు మనం ఇచ్చే నిజమైన నివాళి. బాల్యం భవిష్యత్తుకు పునాది.. మేల్కొనాల్సింది ప్రభుత్వ జీవన విద్య!





శ్రీశైలం దూడం
ఫ్రీలాన్స్ జర్నలిస్టు, 9133947176

రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.